
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం : 28.5
కనిష్ఠం : 22.0
**
ANDHRAJYOTHY

సూర్యాపేట
5
మంగళవారం 19 ఆగస్టు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

| ప్రాజెక్టు | పూర్తిస్థాయి | ప్రస్తుతం | ఇన్‌ఫ్లో | అవుట్‌ఫ్లో |
|---|---|---|---|---|
| | నీటి మట్టం (అడుగులు) | | (క్యూసెక్కులు) | |
| సాగర్ (టీఎంసీలు) | 590 (312.0450) | 585.90 (300.0315) | 3,05,553 | 2,93,982 |
| మూసీ (టీఎంసీలు) | 645 (4.46) | 643.50 (4.04) | 15,643 | 15,643 |
| పులిచింతల (టీఎంసీలు) | 175 (45.77) | 169.519 (37.6826) | 2,55,688 | 3,10,060 |

చికెన్ ధరలు | లైవ్ : రూ. 134 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.235

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నాయి. పథకం అమలు కోసం ఏజెన్సీలను నియమించాయి. మధ్యాహ్న భోజనానికి అవసరమైన బియ్యం మినహా నిత్యావసరాల కొనుగోలుకు నెలనెలా బిల్లులను ఒకటి నుంచి 8వ తరగతి వరకు కేంద్ర ప్రభుత్వం, తొమ్మిది, 10వ తరగతులకు రాష్ట్ర ప్రభుత్వం ఏజెన్సీలకు చెల్లిస్తుంటుంది. అయితే 10 నెలలుగా ప్రభుత్వం, జూలై నెలకు సంబంధించి కేంద్రం బకాయిగా ఉంది. మొత్తంగా జిల్లాలో రూ.4.71 కోట్లు చెల్లించాల్సి ఉంది.
- (ఆంధ్రజ్యోతి-కోదాడ)



# మధ్యాహ్న బకాయిలు రూ.4.71కోట్లు

- 10 నెలలుగా అందని బిల్లులు
- జిల్లాలో 981 ఏజెన్సీలు
- 9, 10వ తరగతి విద్యార్థుల 10 నెలల బకాయిలు రూ.3.20 కోట్లు
- ఒకటి నుంచి 8వ తరగతి విద్యార్థుల బకాయి రూ.1.51కోట్లు

జిల్లాలో సుమారు 981 ఏజెన్సీలకు నెలకు రూ.1.81 కోట్లు మధ్యాహ్న భోజన బిల్లుల కింద ప్రభుత్వం చెల్లిస్తోంది. ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఒక్కొక్కరికి రోజుకు రూ.6.12, ప్రా థమికోన్నత పాఠశాలల విద్యార్థికి రోజుకు రూ.9.19,ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ.10.67లు ఇస్తుంది. కాగా ఉన్నత పాఠశాల విద్యార్థుల బిల్లులు 10 నెలల నుంచి చెల్లించడం లేదు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల ల విద్యార్థుల బిల్లులు జూలై బిల్లు రూ.1.51 కోట్లు, అదేవిధంగా ఉన్నత పాఠశాల బకాయిలు సుమారు రూ.4.71 కోట్లు రావాల్సి ఉందని ఏజెన్సీ నిర్వాహకులు తెలిపారు. ఇప్పటికే పెరిగిన నిత్యావసరాల ధరలతో ఇబ్బందులు పడుతుండగా, అప్పు చేసి సరుకులు తెస్తున్నామని, బిల్లులు రాకపోవటంతో మూలిగే నక్కపై తాటి పండు పడ్డ చందంగా తమ పరిస్థితి తయారైందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేసిన శ్రమకు కూలి కూడా గిట్టడం లేదంటున్నారు. నెల నెలా అందాల్సిన వేతనాలు, బిల్లులు సక్రమంగా అందకపోవడంతో వంట చేయడం దినదిన గండంగా మారిందని, తెచ్చిన అప్పులకు వడ్డీ కట్టలేక ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం 10 నెలల బిల్లులు చెల్లించి ఏజెన్సీలను కాపాడాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు.

### జిల్లాలో పేరుకుపోయిన బకాయిలు

జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 605, ప్రాథమికోన్నత 192, ఉన్నత పాఠశాలలు 184 వరకు ఉన్నాయి. మొత్తంగా 981 పాఠశాలలు ఉండగా అందులో 43వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. సగటున ఒక్కో విద్యార్థిపై రోజుకు రూ.15.31 పైసలు చొప్పున పీఎస్, యూపీఎస్‌లలో చదువుతున్న సుమారు 33 వేల మంది విద్యార్థులపై రోజుకు రూ.5,05,230 ఖర్చు చేస్తున్నారు.నెలకు రూ.1,51,56,000లు ఏజెన్సీలకు ప్రభుత్వం...

- మిగతా 8వ పేజీలో...

### సమస్యల వలయంలో అంగన్‌వాడీ కేంద్రాలు

సూర్యాపేటటౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : చిన్నారులకు ఆటపాటలతో కూడిన ప్రాథమిక విద్య. వారికి అవసరమైన పౌష్టికాహారం అందించాలని, గర్భిణులకు, బాలింతలకు అవసరమైన ఆరోగ్య సలహాలకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటుచేసింది. ఇందుకోసం రూ.కోట్లు ఖర్చు చేస్తుంది. అయినప్పటికీ జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. కొన్ని కేంద్రాల్లో సరైన సౌకర్యాలు లేవు. చాలా కేంద్రాల్లో అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వీటిలో చిన్నారులకు మరుగుదొడ్లు కూడా లేవు. చిన్నారులతో పాటు టీచర్లు, ఆయాలు కూడా సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. స్వచ్ఛమైన తాగునీరు కూడా అందడంలేదు. కొన్ని అంగన్‌వాడీ



లకు ప్రహరీలు లేవు. ఇదిలా ఉండగా సిబ్బంది కొరత వేధిస్తోంది. ఒక్కో కేంద్రంలో ఒక టీచర్, ఒక సహాయ సిబ్బంది ఉండాలి. జిల్లాలో 78మంది టీచర్, 274 మంది సహాయపోస్టులు ఖాళీగా ఉన్నాయి. అంతేకాకుండా కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం సైతం అంతంతగానే ఉంది. అంగన్‌వాడీ కేంద్రాలకు...

- మిగతా 8వ పేజీలో...

# యూరియా కొరత లేకుండా చూడాలి

### వీడియోకాన్ఫరెన్స్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు




వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పక్కన సీఎస్ రామకృష్ణారావు,పాల్గొన్న కలెక్టర్, అధికారులు

సూర్యాపేట(కలెక్టరేట్), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో యూరియా కొరత లేకుండా, రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి సీఎస్ రామకృష్ణారావు, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావుతో కలిసి మంత్రి వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జిల్లా నుంచి కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో పాటు ఎస్పీ నర్సింహతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. అంతర్జాతీయ సమస్యల కారణంగా కేంద్రం నుంచి యూరియా సకాలంలో రాష్ట్రానికి రాకపోవడంతో కొంతమేర కొరత ఏర్పడిందని మంత్రి తెలిపారు. జింక్, డీఏపీ ధరలు ఎక్కువగా ఉండడంతో రైతులు యూరియా ధర తక్కువగా ఉండడంతో ఎక్కువగా వాడుతున్నారని తెలిపారు. రైతులు అధిక మోతాదులో వాడకుండా అవగాహన కల్పించాలన్నారు. సీఎస్ రామకృష్ణారావు, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావు మాట్లాడు తూ గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది లక్ష మెట్రిక్ టన్నుల యూరియాను ఎక్కువగా సరఫరా చేశామన్నారు. అన్నిస్థాయిల్లో యూరియా నిల్వలు, రాబోయే రోజుల్లో అవసరాల వివరాలను పంపాలన్నారు. ప్రైవేట్ డీలర్ల వద్ద ఉన్న యూరియాను రైతులకు అందించాలన్నారు. అనంతరం కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ జిల్లాకు 29వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయిందన్నారు. ఈ నెలలో 3,800 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని, మరో వారం రోజుల్లో యూరియా రావాల్సి ఉందన్నారు. ప్రస్తుతం జిల్లాలో 4135 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. ప్రతి రోజు 600 నుంచి 700 మెట్రిక్ టన్నుల యూరియా విక్రయాలు జరుగుతున్నాయని వివరించారు. ఎస్పీతో సమన్వయం చేసుకుంటూ పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. కాన్ఫరెన్స్‌లో డీఏవో శ్రీధర్‌రెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ సీతారాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను
# ఏర్పాటు చేసుకోవాలి



ఎంఎస్‌కె క్రికెట్ అకాడమీని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

సూర్యాపేట అర్బన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు తమ జీవితాలను ఉన్నతంగా మలుచుకోవడం కోసం ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కుడకుడ రోడ్డులో బీసీసీఐ మాజీ చీఫ్ సెలక్టర్, భారత జట్టు మాజీ సభ్యుడు ఎంఎస్‌కే ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇంటర్నేషనల్ క్రికెట్ అకాడమీని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌తో కలిసి ప్రారంభించి, మాట్లాడారు. ఇంటర్నేషనల్ క్రికెట్ అకాడమీ సూర్యాపేటకు రావడం అభినందనీయమన్నారు. గ్రామీణ క్రీడాకారులకు అకాడమీని అందుబాటులోకి తెచ్చినందుకు ప్రసాద్‌కు అభినందనలు తెలిపారు. క్రీడా రంగంలో సూర్యాపేట ఖ్యాతిని జాతీయ స్థాయిలోకి తీసుకెళ్లాలని సూచించారు. పట్టుదలతో సాధన చేస్తే ఏ రంగంలోనైనా విజయం సాధ్యమన్నారు. పట్టుదలతో ఉద్యమాన్ని నడిపిన కేసీఆర్ తెలంగాణను సాధించారన్నారు. కార్యక్రమంలో ద్రోణాచార్య అవార్డు గ్రహీత, ఫిజికల్ ఫిట్‌నెస్ ట్రైనర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థుల ఆసక్తిని గమనించి ప్రోత్సహించాలి

విద్యార్థుల ఆసక్తిని గమనించి ఆ దిశగా ప్రోత్సహించాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎంఎస్‌కే క్రికెట్ అకాడమీలోని నెట్‌ప్రాక్టీస్ షెడ్‌ను ప్రారంభించి, మాట్లాడారు. విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. జిల్లాకు జాతీయ స్థాయిలో గుర్తింపు తేవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# పేదలకు మెరుగైన వైద్యసేవలు

### మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం హుజూర్‌నగర్ పట్టణంలో రూ.3.5 కోట్లతో నిర్మించనున్న ఓపీ నూతన బ్లాక్, ధోబీఘాట్, పార్కింగ్ షెడ్లకు శంకుస్థాపన చేశారు. రూ.1.25 కోట్లతో నిర్మించిన రక్తనిధి, డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించారు. రూ.3.5కోట్లతో ఏర్పాటుచేసిన సీటి స్కాన్‌ను ప్రారంభించారు. అదేవిధంగా పట్టణంలోని మెయిన్‌రోడ్డులోని ఎన్నెస్పీ స్థలంలో రూ.8 కోట్లతో నిర్మించే ఎన్నెస్పీ కార్యాలయాల సమీకృత భవనాలకు మంత్రి ఉత్తమ్ శంకుస్థాపన చేశారు. అనంతరం విద్యుత్ కార్యాలయం ఎదుట అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి, మాట్లాడారు. పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా వైద్యులు పని చేయాలన్నారు. కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు రక్తనిధి, డయాలసిస్, స్కానింగ్ సెంటర్లను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. మాజీ సీఎం రోశయ్య హయాంలో 100 పడకల ఆసుపత్రి మంజూరు చేయించానన్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించి అండగా ఉండాలన్నారు. పట్టణంలో రూ.7.5 కోట్లతో జూనియర్ కళాశాల, రూ.4.5 కోట్లతో డిగ్రీ కళాశాల భవనాలు నిర్మిస్తున్నామన్నారు. పణిగిరి గట్టు వద్ద 2,160 మోడల్ కాలనీ ఇళ్లు నిర్మిస్తున్నామని త్వరలోని వాటిని పేదలకు పంపిణీ చేస్తామన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్లు, గ్రామీణ రహదారులు నిర్మించామన్నారు. ఐటీఐ, ఏటీసీ కేంద్రాన్ని ప్రారంభించడంతో పాటు కొత్త బస్టాండ్‌కు రూ.4.5 కోట్లు మంజూరు చేయించాన



హుజూర్‌నగర్ ఆసుపత్రిలో సీటి స్కాన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

న్నారు. గడ్డిపల్లిలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను ప్రారంభించామన్నారు. మట్టపల్లి, జాన్‌పాడ్‌లను ఆధ్యాత్మిక పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖాధికారి చంద్రశేఖర్, డీసీహెచ్ఎస్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ డీఎంహెచ్‌వో జయమనోహరి, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ వనజ, డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌గౌడ్, శ్రీనివాసరెడ్డి, డాక్టర్ నాగమణి, తన్నీరు మల్లికార్జున్‌రావు, యరగాని నాగన్న, మాజీ ఎంపీపీ గూడెపు శ్రీను, శ్రీనివాస్‌గౌడ్, గెల్లి రవి, అజీజ్‌పాషా, సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

### అంబేడ్కర్ ఆలోచనలే కాంగ్రెస్ మూల సిద్ధాంతం : మంత్రి ఉత్తమ్

అంబేడ్కర్ ఆలోచన విధానమే కాంగ్రెస్ మూల సిద్ధాంతమని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని విద్యుత్ కార్యాలయం ఎదుట నూతనంగా ఏర్పాటుచేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించి, మాట్లాడారు. ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగాన్ని రచించిన వ్యక్తి అని, సామాజిక న్యాయం కోసం పనిచేసిన గొప్ప సంఘసంస్కర్త అంబేడ్కర్ అని కొనియాడారు. బీజేపీ ప్రభుత్వం, ఎన్నికల సంఘం కుమ్మక్కై, లక్షలాది ఓటర్లను జాబితా నుంచి తొలగించి దొంగ ఓటర్లను చేర్పించారన్నారు. ఓటు చోరీ కేసులో రాహుల్‌గాంధీ బిహార్‌లో చేస్తున్న పాదయాత్రకు దేశ ప్రజలు మద్దతు ఇవ్వాలన్నారు. 300 మంది ఎంపీలను అరెస్ట్ చేయడం సిగ్గుచేటన్నారు. అంబేడ్కర్ 18 ఏళ్లకు ఓటు హక్కు కల్పిస్తే ఎన్నికల సంఘం ఆ ఓట్లను తొలగించిందని ధ్వజమెత్తారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తోందన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకే రాహుల్ పాదయాత్ర చేస్తున్నారన్నారు. అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం గర్వంగా భావిస్తున్నానన్నారు. సామాజిక న్యాయమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. సామాజిక న్యాయం కోసం, పౌరుల హక్కుల కోసం ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. బీజేపీకి తొత్తుగా ఎన్నికల సంఘం వ్యవహరిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ ఫ్రాంక్లిన్, డీఈలు అమరబోయిన శ్రీనివాసులు, వెంకటకృష్ణయ్య, ఏడీఈలు సక్రూనాయక్, నాగిరెడ్డి, రాంప్రసాద్, పోతురాజు రమేష్, జగదీష్, వడ్డాణపు గురవయ్య, రామునాయక్, పి.శ్రీనివాసు, సైదా, ఆర్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సర్వాయి పాపన్నగౌడ్ జీవితాన్ని
# స్ఫూర్తిగా తీసుకోవాలి



సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలవేస్తున్న ఎస్పీ నర్సింహ

సూర్యాపేట క్రైం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని ఎస్పీ కొత్తపల్లి నర్సింహ అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో పాపన్నగౌడ్ జయంతి వేడుకల సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మొదటి బహుజన విప్లవ వీరుడిగా ప్రజల గుండెల్లో పాపన్నగౌడ్ నిలిచి పోయారని కొనియాడారు. ఇదిలా ఉండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ రాములు, నూతనకల్ స్టేషన్ కానిస్టేబుల్ సోమానాయక్‌కు పోలీస్ చేయూత పథకం కింద రూ.2 లక్ష ల చొప్పున మంజూరయ్యాయి. ఆ చెక్కులను ఆయా కుటుంబసభ్యులకు ఎస్పీ అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిందర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, డీఎస్పీ నర్సింహాచారి, ఏవో మంజుభార్గవి, రాంచంద్రర్, ఆర్ఎస్ఐలు సాయిరాం, సురేష్, అశోక్ పాల్గొన్నారు.

# పారిశుధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలి

సూర్యాపేట(కలెక్టరేట్), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పారిశుధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, మాట్లాడారు. భారీ వర్షాల నేపథ్యంలో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ భవనాలు, ఇళ్లను గుర్తించి వాటిలో నివసించేవారిని ఖాళీ చేయించాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలును పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.



ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

### బాలికల క్లబ్‌లు ఏర్పాటు చేయాలి....

బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీలో బాలికల క్లబ్‌లు ఏర్పాటు చేసి వివిధ అంశాలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ తేజస్‌నందలాల్‌పవార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు సోమవారం 78శాతం మాత్రమే హాజరుకావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఏడాదిలో అత్యధికంగా క్యాజువల్ లీవ్స్ ఉపయోగించిన, చెప్పకుండా విధులకు రానివారిని, దీర్ఘకాలిక సెలవులపై ఉన్న ఉపాధ్యాయుల వివరాలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో డీఈవో అశోక్, కోఆర్డినేటర్ జనార్ధన్, శ్రవణ్‌కుమార్, రాంబాబు, పూలమ్మ, అధికారులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్నగౌడ్‌ను ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టర్‌అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, జిల్లా సంక్షేమాధికారులు శ్రీనివాస నాయక్, దయానందరాణి, డీఆర్‌డీవో అప్పారావు, డీఏవో శ్రీధర్ రెడ్డి, డీఎఫ్‌వో సతీష్‌కుమార్, సీపీవో కిషన్, డీఈవో అశోక్‌కుమార్, బొర్రా రాములు, డాక్టర్ రాంమూర్తియాదవ్ పాల్గొన్నారు.

# సమాన పనికి సమాన వేతనం అందించాలి



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

సూర్యాపేట(కలెక్టరేట్), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలకు సమాన పనికి సమాన వేతనం అందించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలకు నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలన్నారు. ప్రీస్కూల్ విద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించాలన్నారు. ఐసీడీఎస్‌కు సంబంధం లేని బీఎల్‌వో విధులను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో శ్రామిక జిల్లా కన్వీనర్ చెరుకు యాకలక్ష్మి, సంఘం నాయకులు భాస్కరమ్మ, రణపంగి క్రిష్ణ, సాయికుమార్, వెంకన్న, లింగమ్మ, స్వరూప, మాధవి పాల్గొన్నారు.

# స్వరాష్ట్రంలో ఉద్యమకారులకు అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న కోతి మాధవిరెడ్డి

సూర్యాపేటటౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమకారులకు తీవ్రఅన్యాయం జరుగుతుందని తెలంగాణ ఉద్యమ కారుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర మహిళా వింగ్ అధ్యక్షురాలు కోతి మాధవిరెడ్డి, తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుండాల సందీప్ యాదవ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని రైతుబజార్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సెప్టెంబరు 12వ తేదీన ఇందిరాపార్క్ వద్ద జరిగే టీయూజేఏసీ మహాధర్నా పోస్టర్‌లను ఆవిష్కరించి, మాట్లాడారు. గత ప్రభుత్వంతో పాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు విస్మరిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులకు ఇంటి స్థలాలు, పించన్లు, గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. మహాధర్నాను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు లింగంపల్లి మురళి, వీరబోయిన రవియాదవ్, మల్లయ్యయాదవ్, సంతోష్, కమలమ్మ, గణేష్, రాజు, సుధాకర్, చందా రామూర్తి, శ్రీనివాస్ పాల్గొన్నారు

# మహిళల హక్కులపై రాజీలేని పోరాటం

సూర్యాపేట టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మహిళా హక్కులు, రైతుల సమస్యలపై తెలంగాణ జాగృతి రాజీ లేని పోరాటం చేస్తోందని తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షురాలు సూరారపు కృష్ణవేణి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికారంలో ఏపార్టీ ఉన్నా తెలంగాణ జాగృతి ప్రశ్నిస్తుందని, నాడు మహిళా బిల్లుకోసం, నేడు బీసీ బిల్లు కోసం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తిరుగులేని పోరాటం చేస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను తప్పుదోవ పట్టించకుండా బీసీ బిల్లు ఆమోదం కోసం కృషి చేయాలన్నారు. అనంతరం పట్టణంలోని పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సయ్యద్ ఇస్మాయిల్, నాతాల సైదిరెడ్డి, ఉమారాణి, సాయిగౌడ్, మాధవి, సంజీవనాయక్, చిరంజీవి, ఫుల్బారి అఖిల్, అబి, నరేందర్, కార్తిక్, కొండేటి అఖిల్ పాల్గొన్నారు.



సూర్యాపేటలో మాట్లాడుతున్న సూరారపు కృష్ణవేణి

# క్రీడలతో సమదృష్టి సాధ్యం

- గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను వెలుగులోకి తెచ్చేందుకు అకాడమీలు
- బీసీసీఐ మాజీ సెలక్టర్ ఎంఎస్‌కే ప్రసాద్

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట(కలెక్టరేట్)



6

# క్రీడలతో సమదృష్టి సాధ్యం

● గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్రతిభగల క్రీడాకారులు
● సౌకర్యాలు లేకనే క్రీడల్లో వెనుకబాటు
● బీసీసీఐ మాజీ సెలక్టర్ ఎంఎస్‌కే ప్రసాద్



అతిథితో కాసేపు

విద్యార్థి దశలో క్రీడలు ఎంతో ముఖ్యం. చదువుతో పాటు క్రీడాలకు ప్రాధాన్యమివ్వాలి. తద్వారా పిల్లలు ధృడంగా తయారవుతారు. ఒకప్పుడు క్రీడలకు విద్యా సంస్థల్లో ప్రాధాన్యమిచ్చేవారు. గెలుపోటములను సమానంగా తీసుకునే శక్తి ఒక్క క్రీడాకారుడికి ఉంటుంది, అది కూడా క్రీడల ద్వారానే అబ్బుతుందని భారత క్రికెట్ జట్టు మాజీ సెలక్టర్, క్రికెట్ జట్టు మాజీ సభ్యుడు ఎంఎస్‌కే ప్రసాద్ అభిప్రాయం వ్యక్తం చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రానికి వచ్చిన సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ముచ్చటించారు.

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట(కలెక్టరేట్)

ప్రస్తుతం ప్రతి ఒక్కరూ విద్యకు మాత్రమే ప్రాధాన్యమిస్తున్నారు. దానితో పాటే క్రీడలకు సమప్రాధాన్యం ఇవ్వాలి. అప్పుడే పిల్లలు ధృడంగా మారడంతో మానసిక ఉల్లాసంతో ఉత్సాహంగా ఉంటారు. పిల్లలకు ఇష్టమైన క్రీడల్లో రాణిస్తే వారు ఆరోగ్యంగా ఉండటంతో పాటు బలమైన ఆరోగ్యకర సమాజమూ నిర్మితమవుతుంది. క్రీడలు లేకపోతే బాల్యం, విద్య కోల్పోయే ప్రమాదముంది.

### గెలుపోటములపై సమాన దృక్పథం క్రీడల్లోనే

పోటీల్లో పాల్గొనే వారందరికీ మెడల్స్ రావు, అయినా క్రీడాకారుడికి మెడల్స్ ముఖ్యం కాదు. ఆడిన ప్రతి ఒక్కరికీ మెడల్స్ రావు. కానీ జీవితంలో గెలుపు, ఓటములను నేర్పుతాయి. దీంతో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తట్టుకునే శక్తి సమకూరుతుంది. జీవితంలో గెలుపు, ఓటములను సమానంగా తీసుకునే శక్తి ఒక క్రీడలకు మాత్రమే ఉంది.

### గ్రామాల్లో సరైన సౌకర్యాలు లేకనే

క్రీడలు పట్టణాలకే పరిమితం కాకూడదు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో నైపుణ్యం కలిగిన క్రీడాకారులు ఉంటారు. వారు రాణించేందుకు సరైన సౌకర్యాలు లేక వెలుగులోకి రావడం లేదు. అలాంటి వారిని గుర్తించి వారిలోని క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు చర్యలు చేపట్టాం.

### కష్టపడి ఎదిగిన వారిలో సిరాజ్ ఒకరు

ప్రతి ఒక్క క్రికెటర్ ఇండియా టీమ్‌కు ఆడలేరు. అందులో అత్యంత మెరుగైన ప్రతిభ కలిగిన వారు మాత్రమే జట్టుకు ఎంపికవుతారు. ఇండియా టీమ్‌కు ఆడకపోయినా ఇంకా ఎన్నో అవకాశాలు ఉన్నాయి. ఇండియా టీమ్‌కు ఆడుతున్న ఎంతోమంది క్రికెటర్లు ఎంతో కష్టపడి ఎంపికైన వారే. అందులో పేసర్ మహ్మద్‌సిరాజ్ ఒకరు. క్రీడా పోటీలతో భవిష్యత్‌ను బాగు చేసుకోవచ్చు. ప్రయత్నిస్తే సాధించలేనిది ఏదీ లేదు.

### కొత్తవారికి ఐపీఎల్ వేదిక

ఐపీఎల్ ఎంతోమంది క్రీడాకారులను వెలుగులోకి తెచ్చింది. అక్కడే చాలామంది ప్రతిభను కనబరిచి భారత జట్టుకు ఎంపికవుతున్నారు. 13ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్ ద్వారానే వెలుగులోకి వచ్చాడు. ఇందుకు ఐపీఎల్ నిర్వాహకులు, రాష్ట్రాల క్రికెట్ అసోసియేషన్లు, వివిధ ఐపీఎల్ క్రికెట్ జట్ల ఫ్రాంచైజీలకు కృతజ్ఞతలు. క్రీడాకారులు వెలుగులోకి రావడంతో పాటు ఐపీఎల్ ద్వారా బీసీసీఐకి కూడా ఆదాయం సమకూరుతోంది.

### క్రికెట్ అకాడమీల ఏర్పాటు

క్రీడా నైపుణ్యం కలిగిన గ్రామీణ, పట్టణాల్లోని క్రికెటర్లకు శిక్షణ ఇచ్చేందుకు క్రికెట్ అకాడమీలను ఏర్పాటుచేస్తున్నాం. ఇప్పటికే హైదరాబాద్‌లో మూడు, గుంటూరు సమీపంలోని నంబూరులో ఒకటి, విశాఖపట్నంలో ఒకటి, ప్రస్తుతం సూర్యాపేటలో ఒక అకాడమీని ఏర్పాటుచేశాం. అంతేకాకుండా తెలుగువారి కోసం అమెరికాలో కూడా క్రికెట్ అకాడమీని ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నాం. మా అకాడమీలో విద్యతో పాటు క్రికెట్‌కు ప్రాధాన్యమిస్తాం. క్రీడాకారులకు శిక్షణ ఇచ్చే విషయంలో ప్రజలు, ప్రభుత్వం భాగస్వాములు కావాలి. అకాడమీలను ఏర్పాటు చేసి శిక్షణ ఇచ్చే వారిని ప్రభుత్వాలు ప్రోత్సహించాలి.

# పక్షం రోజుల్లో తలకిందులు

» 15 రోజుల క్రితం వరకు అనావృష్టి, ఇప్పుడు అతివృష్టి
» వరుస వర్షాలతో జాలు వారుతున్న పత్తి, కంది, మెట్టపంటలు



మోత్కూరులో జాలువారిన కంది చేను

మోత్కూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పక్షం రోజుల్లో సాగు పరిస్థితులు తారుమారయ్యాయి. 15 రోజుల కింది వరకు అనావృష్టి ఉండగా ఇప్పుడు అతివృష్టి నెలకొంది. వానాకాలం సీజన్ ప్రారంభంలో వర్షాలు లేక రైతులు నానా ఇబ్బంది పడ్డారు. పలుచోట్ల వరుణ దేవుడి కరుణ కోసం కప్పకాముడు ఆడారు. వరద పాశం తిన్నారు. ప్రత్యేక పూజలు చేశారు. అయినా వర్షాలు కురియక ఆశించిన స్థాయిలో వరి నాట్లు వేయలేదు. రెండున్నర మాసాల్లో మూడు అడుగుల ఎత్తు పెరగాల్సిన పత్తి, కంది తదితర మెట్ట పంటల చేను ఒక్క అడుగు ఎత్తు మాత్రమే పెరిగాయి. పంగ (కొమ్మలు) తేలలేదు. మొక్కలు ఎదగకుండానే పత్తి చేను పూతకొచ్చింది. ఈ సారి దిగుబడులు అంతంత మాత్రంగా ఉంటాయని రైతులు దిగాలు పడుతున్న పడ్డారు. అయితే ఈ నెల 7 నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతుండగా, చెరువులు, కుంటల్లోకి నీరు వచ్చి చేరుతోంది. బిక్కేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఈ వానాకాలం సాగుకు నీటి కొరత తీరిందని రైతులు కొంత ఊరట చెందగా, వారం రోజుల నుంచి వరుసగా రోజూ కురుస్తున్న వర్షాలతో మెట్ట పంటలు దెబ్బతింటున్నాయి. దీంతో రైతుల్లో మళ్లీ ఆందోళన పెరిగింది.

### యాదాద్రి భువనగిరి జిల్లాలో...

యాదాద్రి భువనగిరి జిల్లాలో వానాకాలం ఇప్పటి వరకు 2,06,523 ఎకరాల్లో వరి, 1,07,710 ఎకరాల్లో పత్తి, 3,037 ఎకరాల్లో కంది, 3,274 ఎకరాల్లో ఇతర మెట్ట పంటలు సాగు చేశారు.

### జాలు వారుతున్న పత్తి, కంది చేలు

వారం రోజులుగా ప్రతిరోజూ వర్షం కురుస్తుండటంతో పత్తి, కంది చేన్లలో నేల తడారక జాలువారుతున్నాయి. అప్పుడు వర్షాలు లేక చేలు ఎదగలేదని, ఇప్పుడు రోజూ కురుస్తున్న వర్షాలతో పత్తి చేలల్లో పూత, గూడ(పిందె) రాలుతుందని రైతులు తెలిపారు. చేను కూడా ఎత్తు పెరగపోవడంతో భారీ వర్షాలకు పత్తి మొక్కలు నేలవాలుతున్నాయని తెలిపారు. వర్షాలకు తెగుళ్ల బెడత పెరుగుతోంది. నేల ఆరక జాలు వారడంతో జాజు రోగం సోకే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో పత్తి రెండు, మూడు సార్లు ఏరుకున్నాక జాజు రోగం వచ్చేదని, ఇప్పుడు పత్తి ఏరడం ప్రారంభించక ముందే జాజు రోగం వచ్చేలా ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలకు కంది మొక్కలు కూడా జాలుపట్టి కుళ్లి పోతున్నాయంటున్నారు.

### పూత, పిందె, ఆకు రాలింది



నాలుగు ఎకరాల్లో పత్తి పంట వేశా. వర్షాలు లేక విత్తిన విత్తనాలు మొలకెత్తక రెండు సార్లు విత్తాను. మొలకెత్తాక కూడా సరైన వర్షాలు లేక చేను ఎత్తు పెరగలేదు. పూత, పిందె వచ్చింది. సుమారు రూ.లక్షకు పైగా పెట్టుబడి పెట్టా. ఇప్పుడు రోజూ వర్షం కురుస్తుండటంతో పత్తి చేను జాలువారి పూత, పిందె,ఆకు రాల్చింది. ఏంచేయాల్లో తోచడం లేదు.

- బండి నాగరాజు, పత్తి రైతు, లక్ష్మీదేవికాల్వ

### నీరు తీసివేసి, పోషకాలు అందించాలి



వర్షాలు అధికంగా కురుస్తున్నందున పత్తి చేన్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. పత్తి మొక్కలకు తగిన పోషకాలు అందించేందుకు 19-19-19 లేదా 13-0-45 లీటర్‌కు 10 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలి. వర్షాలు పూర్తిగా తగ్గిన తర్వాత ఎకరాకు 25 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పోటాష్ కలిపి భూమిలో మొక్కకు నాలుగు అంగుళాల దూరంలో వేయాలి. పత్తి చేనులో గుంపులు, గుంపులుగా మొక్కలు ఎండి పోవడం గమనిస్తే అది వేరుకుళ్లుగా భావించి మొక్కల మొదట్లో చుట్టూ వేరు బాగా తడిసేట్టుగా లీటర్ నీటికి 2.5గ్రాముల కార్బండిజం ప్లస్ మ్యాన్కోజెబ్ కల్పిన మిశ్రమం లేదా మూడు గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ పిచికారీ చేయాలి.

- వీ.కీర్తి, ఎంఏవో, మోత్కూరు

# బీఎస్ఎన్ఎల్ కేబుల్ చోరీ కేసులో ఇద్దరి అరెస్టు



విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కొత్తపల్లి నర్సింహ

సూర్యాపేట క్రైం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : జల్సాల కోసం బీఎస్ఎన్ఎల్ టవర్ల వద్ద ఉండే రేడియో ఫ్రీక్వెన్సీ కేబుల్‌ను చోరీ చేస్తున్న ఇద్దరు వ్యక్తులను సూర్యాపేట జిల్లా మునగాల పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.2.75లక్షల నగదు, 270 మీటర్ల రేడియో ఫ్రీక్వెన్సీ కేబుల్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసుకు సంబంధించి మరొక వ్యక్తి పరారీలో ఉన్నాడు. సోమవారం కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ కొత్తపల్లి నర్సింహ జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. కొన్ని నెలలుగా మునగాల, నడిగూడెం పోలీస్‌స్టేషన్ల పరిధిలోని బీఎస్ఎన్ఎల్ టవర్లకు సంబంధించిన రేడియో ఫ్రీక్వెన్సీ కేబుల్ చోరీకి గురవుతున్నాయని బీఎస్ఎన్ఎల్ అధికారులు నడిగూడెం, మునగాల పోలీసులకు ఫిర్యాదుచేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. దీంతో పాటు కేసు దర్యాప్తులో భాగంగా నడిగూడెం, మునగాల మండలాల పరిధిలోని ప్రజలను అప్రమత్తం చేశారు. కొత్త వ్యక్తులు బీఎస్ఎన్ఎల్ టవర్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, సాగునీటి కాల్వల వెంట కనిపిస్తే విధిగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. దీంతో ఈ నెల 18న మునగాల మండలం ఆకుపాముల సమీపంలోని బీఎస్ఎన్ఎల్ టవర్ దగ్గర ఇద్దరు వ్యక్తులు సంచరిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే ఎస్ఐ తన సిబ్బందితో అక్కడకి చేరుకుని ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నాడు. వారిని ప్రశ్నించగా సరైన సమాధానం రాకపోవడంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించారు. విచారణలో భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డి మండలం రాజపురం గ్రామానికి చెందిన, ప్రస్తుతం కోదాడ సమీపంలోని బాలాజీనగర్‌లో ఉంటున్న కారు మెకానిక్‌గా పని చేసే మహంకాళి శ్రీనాథ్, రాజపురం గ్రామానికి చెందిన ఎలక్ట్రీషియన్‌గా పనిచేసే బుడుపుల వంశీకృష్ణలుగా గుర్తించారు. వీరితో పాటు కోదాడలోని బాలాజీనగర్‌కు చెందిన ఎలక్ట్రీషియన్‌గా పనిచేసే చలిగంటి శ్రవణ్‌కుమార్‌తో కలిసి కొన్నినెలలుగా మునగాల, నడిగూడెం, కోదాడ పట్టణం, హాలియా, మిర్యాలగూడ, గరిడేపల్లి, హుజూర్‌నగర్, చిలుకూరు, నేలకొండపల్లి ప్రాంతాల్లో నిఘా లేని బీఎస్ఎన్ఎల్ టవర్ల వద్ద రేడియో ఫ్రీక్వెన్సీ కేబుల్‌ను చోరీ చేస్తున్నారు. కేబుల్‌ను కాల్చి అందులోని కాపర్‌ను హైదరాబాద్‌లోని వివిధ గుర్తుతెలియని వ్యక్తులకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. విక్రయించగా వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తున్నట్లు అంగీకరించారు. ఇప్పటివరకు 9 పర్యాయాలు చోరీలకు పాల్పడినట్లు తెలిపారు. అందులో భాగంగానే ఆకుపాముల బీఎస్ఎన్ఎల్ టవర్ వద్ద చోరీ చేద్దామని రెక్కీ నిర్వహిస్తున్నట్లు ఒప్పుకున్నారని ఎస్పీ తెలిపారు. దీంతో వారు ప్రయాణిస్తున్న కారును తనిఖీచేయగా అందులో రూ.2.75లక్షల నగదు, 270 మీటర్ల రేడియో ఫ్రీక్వెన్సీ కేబుల్ లభించిందన్నారు. వాటిని స్వాధీనం చేసుకుని మహంకాళి శ్రీనాథ్, వంశీకృష్ణ, శ్రవణ్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం శ్రీనాథ్, వంశీకృష్ణలను కోర్టుకు రిమాండ్‌కు తరలిస్తున్నామని శ్రవణ్‌కుమార్ పరారీలో ఉన్నాడని త్వరలో పట్టుకుంటామని వెల్లడించారు. పరారీలో ఉన్న శ్రవణ్‌కుమార్‌కు గతంలో బీఎస్ఎన్ఎల్ టవర్స్ వద్ద పనిచేసిన అనుభవం ఉందని, అతడిపై గతంలో నాలుగు చోరీ కేసులు ఉన్నాయన్నారు. బీఎస్ఎన్ఎల్ టవర్ల వద్ద చోరీకి పాల్పడుతున్న వ్యక్తులను పట్టుకున్న మునగాల పోలీసులను ఎస్పీ అభినందించారు. సమావేశంలో మునగాల సీఐ రామక్రిష్ణారెడ్డి, ఎస్‌బీఐ రామారావు, మునగాల ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు ఇవ్వాలంటే డబ్బులివ్వాల్సిందే

### లబ్ధిదారుడితో పంచాయతీ కార్యదర్శి ఆడియో వైరల్

పాలకవీడు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు రావాలంటే లంచం ఇవ్వాలని ఓ లబ్ధిదారుడిని గ్రామ కార్యదర్శి డిమాండ్ చేస్తున్న ఆడియో చర్చనీయాంశమైంది. సూర్యాపేట జిల్లా పాలకవీడు మండల పరిధిలోని పాలకవీడు వాట్సప్ గ్రూపులో సోమవారం ఇందుకు సంబంధించిన ఆడియో వైరల్ అయింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పాలకవీడు మండలంలోని జాన్‌పహాడ్ ఇందిరమ్మ ఇళ్ల పైలట్ గ్రామంగా ఎంపికైంది. గ్రామంలో ఇళ్ల నిర్మాణానికి 300మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. రెండు నెలల క్రితం ఈ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించగా కొన్ని ఇళ్లు పునాదుల దశకు, మరికొన్ని స్లాబ్ వరకు వచ్చాయి. ఇప్పటివరకు పూర్తైయిన ఓ ఇంటి నిర్మాణానికి బిల్లులు రావాలంటే రెండు దఫాలుగా రూ.15వేలు ఇవ్వాలని ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి లబ్ధిదారుడితో ఫోన్‌లో మాట్లాడిన ఆడియో వాట్సప్ గ్రూపులో రావటంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై ఆ గ్రామ కార్యదర్శి వెంకట్‌ను వివరణ కోరగా లబ్ధిదారుడితో మాట్లాడిన సందర్భంలో తాను అయోమయంలో ఉన్నానని, ఏం మాట్లాడానో తెలియదన్నారు. ఈ ఘటనపై పాలకవీడు ఎంపీడీవో లక్ష్మిని వివరణ కోరగా, ఆ ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. విచారణకు ఆదేశించామని, ఆడియో నిజమని తేలితే పంచాయతీ కార్యదర్శిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## కబేళాకు తరలిస్తున్న పశువుల పట్టివేత

కోదాడ రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : కబేళాకు తరలిస్తున్న పశువులను సూర్యాపేట జిల్లా కోదాడ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ గోపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం రాజమండ్రి సమీపంలోని జక్కంపూడి పశువుల సంత నుంచి 32 గేదెలను హైదరాబాద్‌కు ఆదివారం రాత్రి తరలిస్తున్నారు. మండలంలోని నల్లబండగూడెం పంచాయతీ పరిధిలోని రామాపురం క్రాస్ రోడ్డు వాహనాల తనిఖీలో భాగంగా గుర్తించి పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. డీసీఎం డ్రైవర్ ఎర్రంశెట్టి సాయి, హేమంత్‌రాజుకుమార్, ఎలమంచిలి రాంబాబు, పశువుల కొనుగోలు దారుడు శ్రీను, డీసీఎం యజమాని దేవీలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# శిథిల భవనం.. వర్షం వస్తే భయం





శిథిలావస్థకు చేరిన దేవరకొండలోని ఆర్డీవో కార్యాలయం. ధ్వంసమైన కార్యాలయ సీలింగ్

నల్లగొండ జిల్లా దేవరకొండ డివిజన్‌లో వర్షం పడిందంటే ప్రభుత్వ కార్యాలయాలు కురుస్తున్నాయి. 2013లో అప్పటి పట్టు పరిశ్రమ కార్యాలయానికి తాత్కాలిక మరమ్మతులు చేసి ఆర్డీవో కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆ భవనం 50 ఏళ్ల నాటిది కావడంతో పాటు పెచ్చులు ఊడి కురుస్తోంది. దీంతో ఉద్యోగులు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా నిజాం కాలంలో వందేళ్ల కిందట గచ్చు గోడలతో నిర్మించిన తహసీల్దార్ కార్యాలయం పరిస్థితి అంతంతమాత్రమే. పైకప్పు పెచ్చులు రాలుతూ కురుస్తోంది. దీంతో గదుల్లోని రికార్డులు, రికార్డులు, వర్షాలకు తడిచే పరిస్థితి నెలకొంది. కొంతకాలంగా తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. వర్షం వస్తే ఎప్పుడు కూలుతుందోనని ఉద్యోగులు, వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు, రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-దేవరకొండ)





తహసీల్దార్ కార్యాలయంలోని ఏళ్ల నాటి రికార్డులు, శిథిలావస్థకు చేరిన నిజాం కాలం నాటి భవనం

## అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



భూక్య సుజాత(ఫైల్)

రాజాపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం పుట్టగూడెంలో సోమవారం అనుమానాస్పదంగా మహిళ మృతి చెందింది. ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజాపేట మండలం పుట్టగూడెం గ్రామానికి చెందిన బూక్యా అమ్రు కూలీ పనులు చేస్తూ జీవనం గడుపుతున్నాడు. అతడికి అదే గ్రామానికి చెందిన బూక్యా సుజాత(36)తో వివాహం కాగా వారికి ముగ్గురు సంతానం. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య తగాదాలు జరుగుతున్నాయి. దీంతో పలుమార్లు పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. అయినప్పటికీ గొడవలు జరుగుతూనే ఉన్నాయి. రోజు మాదిరే నిద్రిస్తున్న సమయంలో ఆదివారం రాత్రి అమ్రు తన కుమారుడు రాకేష్ వద్దకు వచ్చి మీ అమ్మ సుజాత మాట్లాడటం లేదన్నాడు. కుమారుడు రాకేష్, గ్రామస్థులు సుజాతను రాజాపేటకు తీసుకెళ్లగా అప్పటికే ఆమె మృతి చెందింది. అనుమానాస్పదంగా మృతి చెందడంపై సుజాత తల్లి పింప్లీ ఫిర్యాదు చేసిందని ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలేరు ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని సోమవారం యాదగిగుట్ట ఏసీపీ శ్రీనివాసనాయుడు, సీఐ శంకర్‌గౌడ్ సందర్శించి, క్లూస్ టీంను రప్పించి వివరాలు సేకరిస్తున్నారు.

## చేపల వేటకు వెళ్లి యువకుడు గల్లంతు



నవీన్(ఫైల్)

వలిగొండ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలో చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ యువకుడు కాల్వలో పడి గల్లంతయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మోత్కూరు మండలం పాలడుగు గ్రామానికి చెందిన శివరాత్రి నవీన్(25) స్థానికంగా పనులు చేసుకుంటూ తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటున్నాడు. సోమవారం అదే గ్రామానికి చెందిన మరో 10మంది యువకులతో కలిసి చేపలు పట్టేందుకు వలిగొండ మండలం వెల్వర్తి గ్రామానికి వచ్చారు. ఆ గ్రామంలోని ఊరు చివరన బ్రాహ్మణచెరువు నుంచి నర్సయ్యగూడెం వెళ్లే గ్రామాల మధ్యన ఓ కాల్వ ఉంది. ఈ కాల్వలో చేపలు పడుతుండగా అందులో పడి గల్లంతయ్యాడు. యువకుడి కోసం పోలీసులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది స్థానికుల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. కాల్వలో పేరుకుపోయిన గుర్రపుడెక్కతో గాలింపు చర్యలకు కొంత ఆటంకం కలుగుతోంది. గాలింపు చర్యలను సోమవారం రాత్రి డీసీపీ అక్షాంశ్‌యాదవ్, రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు పరిశీలించారు.

## పర్యావరణ పరిరక్షణ

# లక్ష్యంగా స్టీల్ బ్యాంక్

● విశ్రాంత ఉపాధ్యాయుడు పురుషోత్తంరెడ్డి వినూత్న యత్నం



స్టీల్ సామాగ్రిని అందజేస్తున్న పురుషోత్తంరెడ్డి

భువనగిరి టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): విందుల్లో వినియోగిస్తున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కోటెడ్ భోజనం, టిఫిన్ ప్లేట్లు, ప్లాస్టిక్ స్వీట్ కప్స్, స్పూన్స్, వాటర్ గ్లాస్‌లు పర్యావరణానికి ముప్పుగా పరిణమిస్తున్నాయి. చిన్న పాటి విందులు, వినోదాలు జరిగినా ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసుల వినియోగం తప్పనిసరి అవుతున్న పరిస్థితులు ప్రస్తుతం ఉన్నాయి. ఈ నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణకు తన వంతు బాధ్యతగా యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు వెళ్ళంకి పురుషోత్తంరెడ్డి వినూత్న రీతిలో స్టీల్ బ్యాంక్ ఏర్పాటు చేశారు. ఈ మేరకు తన తండ్రి రామచంద్రారెడ్డి జ్ఞాపకార్థం రూ.50 వేల విలువైన స్టీల్ ప్లేట్లు, గ్లాసులు, కప్పులు, స్పూన్స్ తదితర సామాగ్రిని స్వచ్ఛందంగా కాలనీలోని కమ్యూనిటీ హాల్‌కు ఆదివారం అందజేశారు. ఇక నుంచి కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించే కార్యక్రమాలలో భోజనాలకు స్టీల్ సామాగ్రిని ఉచితంగా వినియోగించి పర్యావరణ పరిరక్షణకు, ప్లాస్టిక్ రహిత కాలనీ ప్రయత్నాలకు సహకరించాలని ఆయన కోరారు. స్టీల్ బ్యాంక్ ఏర్పాటుచేసిన పురుషోత్తంరెడ్డిని కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు బీ లక్ష్మారెడ్డి, రఘుపతి, ఉపాధ్యక్షుడు ఎలగల రాజయ్యతో పాటు కాలనీ వాసులు అభినందించారు.

## ప్రథమ చికిత్స చేసిన పోలీసులు



క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స చేస్తున్న పోలీసులు

ఆలేరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు పోలీసులు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తికి ప్రథమ చికిత్స చేసి ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటన సోమవారం మండలంలోని బహదూర్‌పేటలో జరిగింది. మోటకొండూరు మండలం ఇక్కుర్తి గ్రామానికి చెందిన వంగాల మధుసూదన్‌రెడ్డి పనినిమిత్తం ద్విచక్రవాహనంపై వచ్చి తిరుగు ప్రయాణమయ్యాడు. బహదూర్‌పేట సమీపంలో అతడు వాహనం నుంచి పడిపోయాడు. తలకు బలమైన గాయాలు తగిలి అలాగే రోడ్డుపై ఉండిపోయాడు. అటుగా పెట్రోలింగ్‌కు వెళ్లి వస్తున్న ఆలేరు పోలీసులు మధుసూదన్‌రెడ్డికి మంచినీరు తాగించారు. వారి వద్ద ఉన్న ఫస్ట్‌ఎయిడ్‌తో ప్రథమ చికిత్స చేశారు. అనంతరం 108 వాహనంలో ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులను బహదూర్‌పేట గ్రామస్థులు ప్రశంసించారు. కానిస్టేబుల్స్ సైదులు, ప్రసాద్, నవీన్, అశోక్, నరేష్‌ను అభినందించారు.

## తల్లి చనిపోయిందన్న మనోవేదనతో కుమారుడి మృతి

మోత్కూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపాలిటీ కేంద్రంలో అన్నెపువాడకు చెందిన బొల్లు సాయిలు సుమారు రెండేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యాడు. అతనిది నిరుపేద కుటుంబం. భార్య సైదమ్మ కూలి పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషిస్తుండగా తల్లి అతడికి సేవలు చేసేది. నెల రోజుల కిందట తల్లి గుండెపోటుతో మృతి చెందింది. దీంతో సాయిలు తీవ్ర మనోవేదనకు గురై ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఆ కుటుంబానికి ఎలాంటి స్థిర, చరాస్థులు లేవు. ఉండటానికి ఇల్లు కూడ లేక పూరి గుడిసెలో ఉంటున్నారు. అతడికి ఇద్దరు కుమార్తెలు. వారూ చిన్నపిల్లలు. సాయిలు అంత్యక్రియలకు కూడా డబ్బులు లేకపోవడంతో మన మోత్కూరు స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు అంత్యక్రియల నిమిత్తం సోమవారం ఆ కుటుంబానికి రూ.10 వేలు ఆర్థికసహాయం అందించారు. దశదిన కర్మ వరకు మరింత సహాయం అందిస్తామన్నారు. పెద్ద కుమార్తె శ్రావణి తండ్రికి తలకొరివి పెట్టింది. ఆర్థిక సహాయం అందించిన కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు దబ్బెటి సోంబాబు, కారుపోతుల వెంకన్న, కోమటి మత్స్యగిరి, మొరిగాల శ్రీనివాస్, కోమటి జనార్ధన్ పాల్గొన్నారు.

## తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి



యాదగిరిగుట్ట రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లాలో తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు సోమవారం మృతి చెందాడు. సీఐ భాస్కర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యాదగిరిగుట్ట మండలం చిన్నకందుకూర్ గ్రామానికి చెందిన నల్లమాస చంద్రయ్య(45) గ్రామసమీపంలోని తాటిచెట్టు ఎక్కుతుండగా పైనుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. చంద్రయ్యకు భార్య పుష్పతో పాటు నలుగురు కుమారులు ఉన్నారు. ఇద్దరు కుమారులు మృతి చెందగా కోడళ్ల బాధ్యతను చంద్రయ్య చూసుకుంటున్నారు. కుమారుడు భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ భాస్కర్ తెలిపారు.

## గంజాయి పట్టివేత

భువనగిరి టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి రైల్వేస్టేషన్ సమీపంలో గంజాయి విక్రయించేందుకు ప్రయత్నించిన ఓ వ్యక్తిని జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ బృందం అదుపులోకి తీసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన సర్వేష్ అనే మియా సర్కార్ సోమవారం రైల్వేస్టేషన్ ముందు అనుమానాస్పదంగా కనిపించాడు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ బృందం సర్వేశ్‌ను అదుపులోకి తీసుకొని విచారించడంతో గంజాయి విక్రయ ప్రయత్నాలు వెలుగుచూశాయి. ఈ మేరకు నిందితుడి వద్ద రూ.7,500 విలువైన 15 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితుడిపై కేసు నమోదు చేసి ఎక్సైజ్ పోలీసులకు అప్పగించినట్టు టాస్క్‌ఫోర్స్ సీఐ రాధాకృష్ణ తెలిపారు. నిందితుడిని, స్వాధీనం చేసుకున్న గంజాయిని మంగళవారం కోర్టులో ప్రవేశపెట్టనున్నట్టు తెలిపారు.

# 26గేట్ల నుంచి సాగర్ నీటి విడుదల



ఎనిమిది గేట్ల నుంచి విడుదలవుతున్న మూసీ ప్రాజెక్టు నీరు

నాగార్జునసాగర్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువనుంచి వరద రాక పోటెత్తింది. ఈ సీజన్‌లో మూడు లక్షల పైచిలుకు వరద రావడం ఇదే మొదటిసారి. దీంతో సాగర్ ప్రాజెక్టు 26 క్రస్ట్ గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450 టీఎంసీలు) కాగా సోమవారం సాయంత్రానికి 585.90 అడుగులుగా (300.0315టీఎంసీలు) నమోదైంది. సాగర్ నుంచి కుడి కాలువ ద్వారా 6,006క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 4,949క్యూసెక్కులు, వరద కాల్వ ద్వారా 300క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,745క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400 క్యూసెక్కులు, 26క్రస్ట్ గేట్ల నుంచి 2,51,582 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 2,93,982 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతుండగా ఎగువనుంచి 3,05,553 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

**ఎనిమిది గేట్ల నుంచి మూసీ నీటి విడుదల**

కేతేపల్లి: హైదరాబాద్ నగరంలో కురిసిన వర్షానికి సోమవారం మరోసారి మూసీ రిజర్వాయర్‌కు వరద పెరిగింది. సోమవారం సాయంత్రానికి 15643.17 క్యూసెక్కులుగా నమోదైంది. ప్రాజెక్టు నీటిమట్టం 643.50డుగుల గరిష్ఠ స్థాయికి చేరడంతో అప్రమత్తమైన అధికారులు ప్రాజెక్టు ఎనిమిది క్రస్ట్ గేట్లను మూడు అడుగుల మేర ఎత్తి 15,442.28క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు 142.29క్యూసెక్కులు విడుదల కొనసాగుతోంది.

**ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ**

వలిగొండ: యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలో మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. సంగెం, బొల్లెపల్లి కల్వర్టు పైనుంచి వరద నీరు పెరుగుతుండడంతో అధికారులు రాకపోకలను నిలిపివేశారు. ప్రొద్దటూరు వర్కట్‌పల్లి గ్రామాల నడుమ రాకపోకలను కూడా నిలిపివేశారు. మూసీ పరివాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు.

# చివరి రైతుల అవస్థలు

- నీరందక ప్రతి సీజన్‌లోనూ ఇదే తంతు
- తూములు మరమ్మతులకు నోచక నీరంతా వృథా
- చెరువుల్లోకి నీరురాక పడిపోతున్న భూగర్భజలాలు



గుర్రప్పగూడెంలో ఎండిన చెరువులోకి దిగి నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు (ఫైల్)

**ఆయకట్టు చివరి భూములకు నీరందక రైతులు అవస్థ పడుతున్నారు. ఎన్నో ఏళ్లుగా కాల్వ నిర్మాణ పనులు పూర్తిచేసినా చివరి భూములకు నీరందం లేదని దీంతో తమ భూములు బీడుగా మారుతున్నాయని రైతులు వాపోతున్నారు. డి-40కాల్వకు 37తూములు నిర్మించినా వాటి మరమ్మతులు నోచుకోకపోవడంతో నీరంతా వృథా అవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.**

**- ఆంధ్రజ్యోతి, మాడ్గులపల్లి**

పానగల్లులోని ఉదయ సముద్రం ఎత్తిపోతల పథకంలో భాగంగా ఏర్పాటైన డి-40 కాల్వను కట్టంగూరు మండలం బొల్లేపల్లి గ్రామంలో ప్రారంభమై నల్లగొండ మండలంలోని చిన్న సూరారంతోపాటు కొన్ని గ్రామాలను కలుపుకొని తిప్పర్తి మండలంలోని సర్వారం, పజ్జూర్, ఎరగండ్లగూడెం, వెంకటాద్రి పాలెం, సిలారిమీదిగూడెం, మాడ్గులపల్లి మ ండలంలోని ఇందుగుల, సీత్యాతండా, పుచ్చకాయలగూడెం, గుర్రప్ప గూడెం, గణపతివారిగూడెం, బొమ్మకల్ వరకు 23కిలోమీటర్ల మేరా కాల్వ విస్తరించడంతో పాటు 27వేల ఎకరాలకు ఆయకట్టుకు నీరందించేందుకు ఏర్పాటు చేశారు. రైతులు ఆశించిన మేర నీరు రాకపో వడంతో భూములు బీడుగా మారాయి. మాడ్గులపల్లి మండలంలోని గుర్రప్పగూడెం, ఇందుగుల, ఆగామోత్కూర్, సీత్యాతండా, బొమ్మకల్ గ్రామాల్లోని చెరువుల్లోకి సైతం నీరు రాకపోవడంతో భూగర్భజలాలు పడిపోతున్నాయి. మాడ్గులపల్లి మండలంలోని గ్రామాలు ఈ కాల్వపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. కాల్వ చివరి వరకు వస్తే సుమారు మూడు వేల ఎకరాలకు నీరందడంతో పాటు చెరువులు సమృద్ధిగా నిండి భూగర్భజలాలు పెరగడంతో బోరుబావుల మీద ఆధారపడిన రైతులు వ్యవసాయం చేసుకునే అవకాశముంది. నీరు చివరి వరకు రాకపోవడం మూలంగా ఎక్కువ మంది రైతులు వర్షాధారం మీద ఆధారపడి పంటలు పండిస్తున్నారు. డి-40 నీళ్ల చివరి వరకు వస్తే ఇందుగుల, గుర్రప్పగూడెం, సీత్యాతండా, పుచ్చకాయలగూడెం చెరువులు నిండే అవకాశముంది. తద్వారా భూగర్భ జలాలు పెరగడంతో రెండు పంటలు పండించుకునే అవకాశముంది. నీరు కిందకు రాకపోవడంతో బీడు భూములుగా ఉంచుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చివరి ఆయకట్టు నుంచి నీరందించడంతోపాటు చెరువులు నింపితే ఈ సమస్య ఉత్పన్నం కాదని రైతులు పేర్కొంటున్నారు.



నీరు లేక వెలవెలబోతున్న డి-40కాల్వ

**మరమ్మతులకు నోచని డి-40 తూములు**

డి-40 కాల్వకు 37తూములు నిర్మించినా వాటి మరమ్మతులు నోచుకోకపోవడంతో నీరంతా వృథా అవుతోంది. కాల్వ ప్రారంభం నుంచి తూములు సక్రమంగా ఉంటే చివరి దాకా నీరందే అవకాశముంది. తూములకు మరమ్మతులు లేకపోవడంతో నీరంతాపై రైతులు తూములను మూసివేసే పరిస్థితి లేదు. కాల్వకు ఎక్కువగా మోటార్లను ఉపయోగించి నీటిని వాడుకోవడం, అక్రమ తూములను ఏర్పాటు చేసి నీటిని కిందకు రాకుండాపై రైతులు ఆటంకపరుస్తున్నారని చివరి ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారబందీ విధానంతో నీరు కిందకు రాలేని పరిస్థితి నెలకొంది. నీటి విడుదల ప్రారంభించినా ఇప్పటివరకు నీరందడం లేదు.

**చివరి ఆయకట్టుకు నీరందించాలి**



డి-40 కాల్వ ద్వారా చివరి ఆయకట్టు వరకు నీరందించాలి. నీరు లేకపోవడంతో చెరువులు నిండకపోవడంతో భూగర్భజలాలు ఎండిపోయాయి. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి చివరి ఆయకట్టు వరకు నీరందించడంతోపాటు చెరువులను నింపాలి.

- మాడుగుల సాయిలు (పుచ్చకాయలగూడెం రైతు)

**నీళ్ల కోసం తిప్పలు తప్పడం లేదు**



డి-40 నీళ్ల కోసం తిప్పలు తప్పడం లేదు. నీటి విడుదలను ప్రారం భించినా చివరి భూముల వరకు రావడం లేదు. కాల్వల చుట్టు తిరిగినా పట్టించుకునే నాదుడే కరువయ్యారు. ఇప్పటికైనా నీటిని విడుదల సామర్థ్యాన్ని పెంచి చివరి భూములకు వరకు నీరందించేలా అధికారులు కృషిచేయాలి.

- వెంకట్‌రెడ్డి (మాజీ సర్పంచ్, రైతు, బొమ్మకల్)

**రైతులకు ఇబ్బంది కలిగించం**

డి-40కాల్వకు ఉదయ సముద్రం ప్రాజెక్టు నుంచి నీటి విడుదలను ప్రారంభించాం. 0-10 తూము వరకు నాలుగు రోజులు, 11 నుంచి 37వ తూము వరకు నీటి విడుదలను కొనసాగిస్తున్నాం. ప్రస్తుతం ఇందుగుల గ్రామం వరకు నీరు చేరుకుంది. మరో మూడు రోజులు నీటి విడుదల కొనసాగుతుంది. రైతులకు ఎక్కడ ఇబ్బందులు కలిగించం. రైతులెవరూ ఆందోళన చెందవద్దు.

● ఆంజనేయస్వామి, డి-40 డీఈ

# గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలి

● సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి



గర్నెకుంటలో వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి

పెద్దవూర, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఐక్యంగా ఉండి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా పెద్దవూర మండల పరిధిలోని గర్నెకుంట, వెల్మగూడెం గ్రామాల్లో దాచిరెడ్డి మాధవరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారులు దాచిరెడ్డి డీవీఎన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి రూ.12లక్షలతో ఏర్పాటు చేసిన ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డితో కలిసి సోమవారం ప్రారంభించారు. మాధవరెడ్డి ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి నీటి కొరత తీర్చడం అభినందనీయమన్నారు. కులాలకు, మతాలకు అతీతంగా గ్రామాల్లో ప్రజలు ఐక్యంగా ఉండాలన్నారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఉంటే ఇతర చెరువుల నుంచి నీటిని అందించి సమస్యను పరిష్కరిస్తానన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, నాయకులు ధర్మారెడ్డి, నాగరాజు, వెంకటయ్య, లక్ష్మయ్య, శంకర్, ఎంపీడీవో సుధీర్, గ్రామ కార్యదర్శి ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

# నిరంతర అభ్యాసం అవసరం



మాట్లాడుతున్న విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నిరంతర అభ్యాసం అవసరమని విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అన్నా రు. యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం దేశ్‌ముఖి గ్రామ శివారులోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో సోమవారం జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహిస్తే వారు ఆరోగ్యంగా, మానసి కంగా, సర్వతోముఖాభివృద్ధి చెందుతారన్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఫిజికల్ ఫిట్‌నెస్‌కు క్రెడిట్స్‌ను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, విజ్ఞాన్స్ యూనివర్సిటీ సలహాదారు, విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ పూనం మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

# ముందుకు వెళ్లలేక.. వెనక్కి రాలేక

● చిట్యాలలో ఆరు కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు ● చౌటుప్పల్‌లో కొనసాగిన వాహనాల రద్దీ



చౌటుప్పల్: హైదరాబాద్ వైపు జాతీయ రహదారిపై బారులు తీరిన వాహనాలు

చిట్యాల రూరల్, చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని పెద్దకాపర్తి, యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో 65వ జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. గంటల కొద్దీ ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో పోలీసులు తీవ్రంగా శ్రమించారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు కొనసాగుతున్నాయి. సోమవారం జాతీయ రహదారిపై వాహనాల రద్దీ పెరగడంతో పెద్దకాపర్తి నుంచి చిట్యాల వరకు సుమారు కిలోమీటర్ల మేరకు ట్రాఫిక్‌జామ్ అయింది. విద్యా సంస్థలకు సెలవులు ముగియడంతో వాహనాలు హైదరాబాద్‌కు బాట పట్టాయి. పెద్దకాపర్తి వరకు వెళ్లేసరికి బస్‌స్టేజీ సమీపంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు కొనసాగుతుండడంతో వాహనాలను సర్వీసు రోడ్డు నుంచి దారి మళ్లిస్తున్నారు. వాహనాలు నెమ్మదిగా వెళ్తున్న క్రమంలో చిట్యాల నుంచి పెద్దకాపర్తి వరకు వెళ్లడానికి సుమారు 30నిమిషాలకు పైగా సమయం పట్టిందని వాహనదారులు తెలిపారు. వాహనాలు నిలిచిపోకుండా నార్కట్‌పల్లి సీఐ నాగరాజు పోలీసులు, ఎన్‌హెచ్ఏఐ సిబ్బందితో పెద్దకాపర్తి వద్ద ఫ్లైఓవర్ వంతెన పనులు జరిగే ప్రాంతంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరింపజేశారు

**రాత్రంతా వర్షం.. ట్రాఫిక్‌కు ఆటకం**

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం 11:30 గంటల వరకు వాహనాల రద్దీ కొనసాగింది. ఏపీలోని వైజాగ్, కాకినాడ, రాజమండ్రి, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు వెళ్లేందుకు భారీగా వాహనాలు రావడంతో అంతా అయోమయ పరిస్థితి నెలకొంది. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి వద్ద ఫ్లైఓవర్ నిర్మిస్తుండడంతో కొన్ని వాహనాలను సర్వీసు రోడ్ల వెంట పంపిస్తున్నారు. ఈ క్రమంలో విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే సర్వీస్ రోడ్డులో ఆదివారం రాత్రి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. చౌటుప్పల్ మీదుగా ఔటర్‌రింగ్ రోడ్డు వరకు ట్రాఫిక్ కొనసాగిందని వాహనదారులు తెలిపారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు పోలీసులు తెల్లవారుజాము నుంచే ప్రయత్నాలు ప్రారంభించారు. చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి పర్యవేక్షణలో సీఐలు మన్మథ కుమార్, విజయ్‌మోహన్ ఆధ్వర్యంలో పోలీసులు ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు.



పెద్దకాపర్తిలో సర్వీసు రోడ్డు నుంచి వెళ్తున్న వాహనాలు

# శివకేశవులకు విశేష పూజలు



లక్ష్మీనారసింహులకు కల్యాణం నిర్వహిస్తు హారతి నివేదిస్తున్న అర్చకుడు


యాదగిరిగుట్ట, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి కొండపై సోమవారం శివకేశవులకు విశేష పూజలు కొనసాగాయి. స్వామిఅమ్మవారికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, పర్వత వర్ధిని రామలింగేశ్వరస్వామి శివాలయంలో స్ఫటికమూర్తులకు శైవాగమశాస్త్ర రీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామి అమ్మవారిని మేల్కొలిపిన అర్చకులు మూల మూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. సా యంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్ర నామార్చనలు ఆగమశాస్త్రరీతిలో కొనసాగాయి. శివాలయంలోని ముఖమండపంలో స్ఫటికమూర్తులను అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. వివిధ విభాగాల ద్వారా ఖజానాకు రూ.23,94,907 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు.

**కొనసాగిన భక్తుల రద్దీ**

మూడు రోజుల(శుక్ర, శని, ఆదివారం) సెలవులు కావడంతో సోమవారం కూడా భక్తుల రద్దీ కొనసాగింది. ఉదయం, సాయంత్రం బ్రేక్ దర్శనం రెండు గంటలు, మధ్యాహ్నం ఆరగింపు గంట సమయం కలుపుకొని మూడు గంటల పాటు ఉభయ క్యూలైన్లల్లో భక్తులు వేచి ఉన్నారు. రాత్రి వరకు రద్దీ కొనసాగింది. ప్రత్యేక దర్శనానికి అర్ధగంట, ధర్మదర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. సుమారు 23వేల మంది దర్శించుకున్నారు. కొండపైన బస్టాండ్‌లో హైదరాబాద్‌కు చెందిన భక్తుల మధ్య బస్సు ఎక్కేటప్పుడు స్వల్ప వాగ్వాదం జరిగింది.

మఠంపల్లి: మట్టపల్లి లక్ష్మీనృసింహుడి ఆలయంలో సోమవారం విశేష అర్చనలు జరిగాయి. ఆలయంలో ప్రాత:కాలార్చనలు పూర్తయాక అర్చకులు మూలవర్యులకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి సహస్ర నాగవల్లీ దళార్చన జరిగింది. ఉదయం 9:30గంటలకు లక్ష్మీనృసింహుడి పరిణయోత్సవ క్రతువు ప్రారంభమైంది. శ్రీదేవి, భూదేవి సమేత మట్టపల్లి లక్ష్మీనరసింహుడి మూర్తులను కల్యాణ వేదికపై అధిష్ఠింపజేసి విష్వక్సేనారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సరికొండ నవీన్ ఆలయ అర్చకులు, సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

# ఖిల్లా ముఖద్వారాన్ని పట్టించుకోరా?



వర్షాలకు కూలుతున్న ఖిల్లా ముఖద్వారం

దేవరకొండ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండ ఖిల్లా ముఖ ద్వారాలు, ప్రధాన గోపురాలు వర్షాలకు కూలుతున్నాయి. పురావస్తు టూరిజం శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో పురాతన కట్టడాలు, శిల్పాలు దెబ్బతింటున్నాయి. 13వ శతాబ్దంలో నిర్మితమైన దేవరకొండ కోటకు 750 సంవత్సరాల సుదీర్ఘ చరిత్రఉంది. తొలి ఏకాదశి, మహాశివరాత్రి పర్వదిన వేడుకలను దేవరకొండ ఖిల్లాలోని శివాలయంలో జరుపుకుంటారు. పర్యాటకులతోపాటు దేవరకొండ పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు కోటకు చేరుకొని దేవాలయంలో పూజలు చేస్తారు. దేవరకొండ ఖిల్లాలోని పూర్ణకుంభం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ అధికార చిహ్నం. సుదీర్ఘ చరిత్రకలిగిన దేవరకొండ ఖిల్లాను పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేసి అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## ఎరువుల కొరత తీర్చాలి

నల్లగొండ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాలో ఎరువుల కొరత తీర్చాలని నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ కసిరెడ్డి శేఖర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మండలాలకు, పీఏసీఎస్‌లకు యూరియా సరఫరా కాకపోవడంతో పత్తి, వరి పంటలకు ఎరువులు లేక పంటలు ఎదగడం లేదని, పంటలు దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపించనుందని తెలిపారు. ప్రస్తుతం వర్షాలు సమృద్ధిగా పడటంతో పాటు సాగర్ ఆయకట్టుకు నీటివిడుదల వల్ల యూరియా అవసరాల పెరిగాయన్నారు. ఇప్పటికైనా జిల్లాకు సరిపడా ఎరువులను సరఫరా చేయాలని కోరారు.

# హైలెవల్ హామీ అమలుకాలే!

● 2020లో భారీ వర్షాలకు కొట్టుకుపోయిన అప్రోచ్ రోడ్డు ● మరమ్మతులు చేసి రాకపోకల పునరుద్దరణ ● హైలెవల్ బ్రిడ్జి నిర్మిస్తామని గత ప్రభుత్వం హామీ ● కాంగ్రెస్ సర్కార్‌లోనైనా మంజూరయ్యేనా?



అమ్మనబోలు వద్ద మూసీ వాగుపై ఉన్న బ్రిడ్జి

నార్కట్‌పల్లి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని అమ్మనబోలు-పొడిచేడు గ్రామాల మధ్య ఉన్న మూసీ వాగుపై హెలెవల్ బ్రిడ్జి నిర్మాణం ఐదేళ్లుగా మాటలకే పరిమితమైంది. ఈ వాగుపై ఉన్న లోలెవల్ బ్రిడ్జిని హైలెవల్ బ్రిడ్జిగా మారుస్తామని బీఆర్ఎస్ హయాంలో అప్పటి మంత్రి జగదీశ్‌రెడ్డి హామీ ఇచ్చారు. పాలకులు మారినా బ్రిడ్జి ప్రతిపాదనలు ముందుకు కదలడం లేదు. ఇదే మండల వాసి అయిన ప్రసుత రోడ్డు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఈ హైలెవల్ బ్రిడ్జి నిర్మాణంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. నల్లగొండ-యాదాద్రి భువనగిరి జిల్లాలకు సరిహద్దుగా అమ్మనబోలు-పొడిచేడు శివారుల్లో ప్రవహించే మూసీ వాగుపై లోలెవల్ బ్రిడ్జి ఉన్నది. 2020 అక్టోబరులో కురిసిన భారీ వర్షాలకు ఎగువన హైద్రాబాద్ నగరం నుంచి వచ్చిన వరద నీటి ఉధృతితో లోలెవల్ బ్రిడ్జికి అనుసంధానంగా ఉండే ఆర్అండ్‌బీ రోడ్డు కొట్టుకుపోయింది. రక్షణ గోడలు కూడా కొన్ని చోట్ల దెబ్బతిన్నాయి. దీంతో మోత్కూర్- నార్కట్‌పల్లి మధ్య అప్పట్లో కొన్ని రోజులు రాకపోకలు నిలిచిపోయాయి. అప్రోచ్ రోడ్డు సుమారు 184మీటర్ల మేర కొట్టుకుపోగా సుమారు రూ.75లక్షల అంచనా వ్యయంతో అప్పట్లో ఈ రోడ్డును పునరుద్ధరించారు. వరద ఉధృ తికి దెబ్బతిన్న బ్రిడ్జిని అప్పటి మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పరిశీలించారు. వరద ఉధృతితో ఎప్ప టికైనా ఈ బ్రిడ్జికి ముప్పేనని గ్రహించి హైలెవల్ బ్రిడ్జి నిర్మి స్తామని హామీ ఇచ్చారు. అప్పటి సీఎం కేసీఆర్‌ను కలిసి ప్రత్యేక నిధుల కోసం ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కూడా ఈ బ్రిడ్జి ఎత్తు పెంచే ప్రతిపాదనలు సిద్ధం కాలేదు.

**మంత్రి కోమటిరెడ్డి దృష్టి పెడితే**

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇదే మండల వాసి కావడం స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం చొరవ చూపి ప్రత్యేక దృష్టి పెడితే మోక్షం లభించవచ్చని రెండు జిల్లాల ప్రజలు భావిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో రోడ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం హ్యామ్ విధానాన్ని అనుసరిస్తున్న నేపథ్యంలో అవకాశముంటే ఈ బ్రిడ్జిని కూడా హ్యామ్‌లో చేర్చి మోక్షం కలిగించాలని కోరుతున్నారు.

**హైలెవల్ బ్రిడ్జి మంజూరు చేయాలి**



అమ్మనబోలు-పొడిచేడు మధ్యలో ఉన్న మూసీ వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలి. హైద్రాబాద్‌లో కురిసిన భారీ వర్షాలకు అప్రోచ్ రోడ్డు కొట్టుకు పోయినపుడు హైలెవల్ బ్రిడ్జిగా మారుస్తామని గత ప్రభుత్వంలో హామీ ఇచ్చారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వమైనా మూసీ వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి. ఈ రోడ్డుపై రాకపోకలు పెరిగే అవకాశం దృష్ట్యా ఆ దిశగా స్థానిక నేతలు అధికార పార్టీ ప్రజాప్రతినిధులను కలిసి విజ్ఞప్తి చేయాలి.

● బద్దం రాంరెడ్డి, అమ్మనబోలు

## ఆలయంలో సూర్య నమస్కార యోగాసనాలు

ఆత్మకూర్(ఎస్), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెమ్మికల్ దండు మైసమ్మ ఆలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వేదాంత యోగ గురువు జగన్నాథచార్యులు సోమవారం పూజలు నిర్వహించారు. అమ్మవారి చిత్రపటాన్ని వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద సూర్య నమస్కారాలకు సంబంధించిన ఆసనాలు వేశారు. యోగా గురువు జగన్నాథచార్యులను ఆలయ ఈవో కుశలయ్య, దేవాలయ డైరెక్టర్లు, సిబ్బంది సన్మానించారు.

## షీ టీం ఎస్ఐగా మల్లేష్ బాధ్యతల స్వీకరణ

కోదాడ రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కోదాడ సబ్ డివిజన్ షీ టీం ఎస్ఐగా మల్లేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కోదాడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోదాడ సబ్ డివిజన్ పరిధిలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు. మహిళలు తమకు జరిగిన అన్యాయాలను నిర్భయంగా ఫిర్యాదు చేయొచ్చని అన్నారు. బాధితుల వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

# నీటిపారుదల శాఖ పునర్వ్యవస్థీకరణ

**నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

హుజూర్‌నగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదల శాఖను పునర్వ్యస్థీకరిస్తున్నట్లు నీటిపారుదల శాఖ మంత్రి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఎన్ఎస్పీ స్థలంలో రూ.8 కోట్లతో నిర్మిస్తున్న ఎన్ఎస్పీ సమీకృత కార్యాలయ భవనాలకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. హుజూర్‌నగర్, కోదాడ, సర్కిళ్లలో 2లక్షల 30వేల ఎకరాల ఆయకట్టు, హుజూర్‌నగర్ డివిజన్‌లో లక్షా 50వేల ఎకరాల ఎత్తిపోతల ఆయకట్టు ఉందన్నారు. పట్టణంలో జీ ప్లస్-2 మోడల్‌లో 21900 చదరపు అడుగులలో నూతన భవనాలు నిర్మిస్తామన్నారు. పాలకవీడు మండలంలో జాన్‌పాడ్, బెట్టెతండా ప్రాంతాల్లో సుమారు 10వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు జవహర్ జాన్‌పాడ్ పథకాన్ని నిర్మిస్తున్నామన్నారు. చింతలపాలెం మండలంలో బుగ్గమాదారం వద్ద రాజీవ్‌గాంధీ ఎత్తిపోతల పథకం కింద సుమారు 14వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించేందుకు రూ.394 కోట్లతో లిఫ్ట్‌ను నిర్మిస్తున్నామన్నారు. ఎన్ఎస్పీలో సుమారు 3వేల ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. ఏఈలు, లస్కర్లను నియమిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ నాగార్జునరెడ్డి, మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, ఎన్ఎస్పీ ఎస్ఈ నాగభూషణం, ఈఈ రామ్‌కిషోర్, సత్యనారాయణ, రఘు,నాగన్న, మల్లికార్జున్‌రావు, గూడెపు శ్రీనివాసు, అజీజ్ పాషా, సుబ్బారావు పాల్గొన్నారు.

**రాజ్యాంగాన్ని హేళన చేస్తున్న ఎన్నికల సంఘం**

భారత రాజ్యాంగాన్ని కేంద్ర ఎన్నికల సంఘం హేళన చేస్తోందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం హుజూర్‌నగర్ పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో రూ.3కోట్లతో ఏర్పాటుచేసిన సీటీ స్కాన్, రక్తనిధి సెంటర్, రూ.8 కోట్లతో నిర్మిస్తున్న నీటి పారుదల శాఖ సమీకృత భవనాల సముదాయం, అంబేద్కర్ విగ్రహాన్ని ప్రారంభించిన అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఓటు ఘటనలో చేస్తున్న పాదయాత్రకు భారత ప్రజలందరూ మద్దతు తెలపాలన్నారు. ఈ ఘటనపై దేశంలో ఢిల్లీ పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం కార్యాలయం వరకు పాదయాత్ర చేస్తుంటే 300 మంది ఎంపీలను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌లో పెట్టారని విమర్శించారు. . అంబేద్కర్ సిద్ధాంతమే కాంగ్రెస్ పార్టీ మూల సిద్ధాంతమన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఎస్ఈ ఫ్రాంక్లిన్, డీఈలు వెంకటకృష్ణయ్య, అమరబోయిన శ్రీనివాసులు, చంద్రశేఖర్, డీసీహెచ్ఎస్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్‌లో ఇరిగేషన్ సమీకృత కార్యాలయ భవనాలకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి**

కోదాడ టౌన్: కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వారియర్లు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సూచించారు. సోమవారం కోదాడ పట్టణంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల సోషల్ మీడియా వారియర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో అభివృద్ధి పనులు చేయడమే కాదు జరిగిన అభివృద్ధిని కూడా చెప్పాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలోఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ వంగవీటి రామారావు, పీసీసీ ప్రతినిధి చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ



విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

మునగాల, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చెరువు గట్టు సమీపంలో రజకుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో మడేలేశ్వర, సీతాలమ్మ, పోతురాజుల విగ్రహాలను సోమవారం ప్రతిష్ఠించారు. మూడు రోజుల నుంచి సన్నాయి వాయిద్యాలతో వేద పండితులు ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ మనుమడు, మనుమరాలు చిట్యాల సంపత్, చిట్యాల శ్వేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకున్నవారికి మానసిక ప్రశాంత లభిస్తుందని అన్నారు. అన్నదానం, పూజకు రూ.1.51లక్షలు ఉత్తమ్ పద్మావతి యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు తొగాటి వేలాద్రి, హైమావతి దంపతులు ఇవ్వడం అభినందనీయమని అన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వి.చంద్రశేఖర్, ఎంపీడీవో రమేష్‌దీన్‌దయాల్, కార్యదర్శి చంద్రశేఖర్, గ్రామ పురోహితులు బుచ్చిరామయ్యశాస్త్రి, కిషోర్‌శాస్త్రి, కందకట్ల శ్రీనివాసరావు, తంగెళ్ల నాగేశ్వరావు, ముక్కోళ్ల వెంకటేశ్వరరావు, టి.లతీఫ్, తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ విగ్రహం ధ్వంసం అప్రజాస్వామికం

కోదాడ టౌన్, తుంగతుర్తి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా వనపర్తి పట్టణంలోని గాంధీ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడం అప్రజాస్వామికమని జిల్లా ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు వెంపటి వెంకటేశ్వరరావు అన్నారు. గాంధీ విగ్రహాన్ని ధ్వసం చేయడాన్ని సోమవారం ఒక ప్రకటనలో ఆయన ఖండించారు. ఈ ఘటనను జిల్లా ఆర్యవైశ్య సంఘం తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు. సంబంధిత అధికారులు దుండగులను తక్షణమే గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

● వనపర్తిలో మహాత్మా గాంధీ విగ్రహాన్ని కొంతమంది దుండగులు ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ ఎంపీపీ తాటికొండ సీతయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

## స్థూప నిర్మాణానికి సహకరించాలి

తిరుమలగిరి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ నాయకుడు పొట్ల రామనర్సయ్య స్థూప నిర్మాణానికి అందరూ సహకరించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. సోమవారం తిరుమలగిరి మునిసిపల్ కేంద్రంలో పొట్ల రామనర్సయ్య స్థూప నిర్మాణ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. తిరుమలగిరిలో నవంబరు మూడో తేదీన పొట్ల రామనర్సయ్య స్థూపాన్ని ఆవిష్కరిస్తామని, ఈ కార్యక్రమానికి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి పేర్ల నాగయ్య, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర అఖిల్, రేణుక, కొండయ్య, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

## అనుమతులు లేకుండా ఇళ్లలోకి వెళితే చర్యలు

మద్దిరాల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లలోకి వెళితే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ అయేషాపర్వీనా, ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి అన్నారు. సోమవారం మద్దిరాల గ్రామంలోని డబుల్ బెడ్ రూం ఇళ్లను ఆక్రమించుకున్న లబ్ధిదారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. లబ్ధిదారుల నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అర్హులకు ఇళ్లను కేటాయించి న్యాయం చేస్తామని, ఎవరూ తొందరపడొద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కంట్లమయ్య, ఆర్ఐలు వహిద్దీన్, జూనియర్ అసిస్టెంట్లు సతీష్, ఉపేందర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అఖిల్ పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

హుజూర్‌నగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : వినాయకచవితి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సీఐ రాజు కోరారు. సోమవారం పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఉత్సవాలు నిర్వహించే మండపాల నిర్వాహకులు ప్రభుత్వం ఏర్పాటుచేసిన పోర్టర్ ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వాహకులు సమన్వయం, పరస్పర సహకారంతో వేడుకలు నిర్వహించుకోవాలన్నారు. ఆన్‌లైన్ పోర్టర్‌లో అన్ని వివరాలను నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ మోహన్ బాబు, ఎఎస్ఐ బలరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సర్వారం గ్రామంలో డీజే సీజ్

గరిడేపల్లి, ఆగస్టు 18 ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వారం గ్రామంలో గంగమ్మ జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన డీజేని సీజ్ చేసినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. డయల్ 100కు ఫిర్యాదు రావడంతో డీజే నిర్వాహకుడు షేక్ మౌలాలిపై కేసు నమోదు చేయడంతో పాటు డీజేని ఏర్పాటు చేసిన ట్రాక్టర్‌ను కూడా సీజ్ చేసినట్లు తెలిపారు. వినాయక చవితి ఉత్సవాలకు కూడా డీజే అనుమతి లేదన్నారు.

## దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కోదాడ రూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): దాతల సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలని రిటైర్డు ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య అన్నారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి మనుమడు పుట్టినరోజు సందర్భంగా సోమవారం కోదాడ లోని తమ్మర ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులకు ఇంగ్లిషు డిక్షనరీలు అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, వేనేపల్లి శ్రీనివాసరావు, బ్రొల్లు రాంబాబు, కె.విద్యాసాగర్‌రావు, జగన్మోహన్‌రావు, రఘువరప్రసాద్, గడ్డం నరసయ్య, హరిబాబు, ఖలీల్, అహ్మద్, శ్యాంసుందర్‌రెడ్డి, హెచ్ఎం రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల తోడ్పాటు అభినందనీయం

సూర్యాపేట అర్బన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు తోడ్పాటు అందించడం అభినందనీయమని డీఐఈవో బాలునాయక్, మునిసిపల్ మాజీ ఛైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వం జూనియర్ కళాశాలలో జడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో 'ఉగ్రవాదం- ఆపరేషన్ సింధూర్'పై నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. కళాశాలలో ఆర్చి నిర్మాణానికి, పాత కళాశాల భవన ఫొటో గ్యాలరీ ఏర్పాటుకు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ సూర్యనారాయణ, వి.విశ్వమోహన్, ఉప్పునూతల మహేందర్‌రెడ్డి, మాజీ పీడీ పటేల్ నర్సింహారెడ్డి, విద్యాసాగర్, సత్యనారాయణ, పెద్దిరెడ్డి గణేష్, రాందాస్, పెరుమాళ్ల యాదయ్య, చంద్రశేఖర్, వేణుధర్ పాల్గొన్నారు.

# సర్వాయి పాపన్న ఆశయాలను సాధించాలి



సూర్యాపేట సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గీత కార్మిక సంఘం నాయకులు

ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్, ఆగస్టు 18: సర్వాయి పాపన్న ఆశయాలను సాధించాలని పలువురు వక్తలు అన్నారు. పాపన్న జయంతి పురస్కరించుకుని సోమవారం జిల్లాలోని పలుచోట్ల ఆయన చిత్రపటాలకు ఘన నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలోని కొత్త బస్‌స్టేషన్ సమీపంలో నిర్వహించిన కార్యక్రమంలో గీత కార్మిక సంఘం అధ్యక్షుడు పులుసు వెంకన్న, సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గిలకత్తుల రమేష్‌గౌడ్ మాట్లాడుతూ పాపన్నగౌడ్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలంపల్లి వినయ్, గిలకత్తుల నాగమణి, అనంతుల నవ్య, సుదర్శన్, నకిరేకంటి చిరంజీవి పాల్గొన్నారు. తిరుమలగిరిలో నిర్వహించిన కార్యక్రమంలో గిలకత్తుల ప్రియలతరాముగౌడ్, కొంపల్లి రాంమూర్తి వీరమల్లు, రామచంద్రన్‌గౌడ్, మోడెపు వీరన్న, పాలకుర్తి శ్రీకాంత్, సంపత్ పాల్గొన్నారు. తిరుమలగిరి మండలం వెలిశాల ఎక్స్ రోడ్డు సెంటరులో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సుంకరి జనార్దన్, రాజయ్య, కుంభం సతీష్, రాములు పాల్గొన్నారు. పెన్‌పహాడ్‌లో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మడ్డి అంజిబాబుగౌడ్, సైదులుగౌడ్, పరశురాములులు నివాళులర్పించారు.

**హుజూర్‌నగర్ నియోజకవర్గంలో..**

హుజూర్‌నగర్‌లో పాపన్నగౌడ్ చిత్రపటానికి ఐఎన్‌టీయూసీ రాష్ట్ర జనరల్ సెక్రటరి యరగాని నాగన్నగౌడ్, మునిసిపల్ మాజీ ఛైర్మన్ దొంతగాని శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వల్లబుదాసు కృష్ణ, తన్నీరు మల్లికార్జున్‌రావు, సీహెచ్ సైదా సైదులు పాల్గొన్నారు. మేళ్లచెర్వు మండలం వెల్లటూరులో అంతయ్య, కొండలు, వెంకట్రామయ్య, ఏడుకొండలు, గరిడేపల్లిలో కొండ సైదులు, మండవ నాగేశ్వరరావు, శ్రీనివాస్ , బక్కయ్య , లక్ష్మయ్య, వీరబాబు ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

**తుంగతుర్తి నియోజకవర్గంలో..**

పాపన్నగౌడ్ భారతదేశంలో మరో శివాజీ అని డీసీఎంఎస్ డైరక్టర్, తుంగతుర్తి సింగిల్ విండో ఛైర్మన్ గుడిపాటి సైదులు అన్నారు. తుంగతుర్తిలోని పాపన్న విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో చింతకుంట్ల వెంకన్న, దొంగరి గోవర్దన్, కిషన్‌రావు పాల్గొన్నారు. కొత్తగూడెంలో రాములు, పులుసు యాదగిరి, తునికి సాయిలు పాల్గొన్నారు. నూతనకల్, మద్దిరాల మండలం పోలుమళ్లలో నిర్వహించిన కార్యక్రమాల్లో తుంగతుర్తి మార్కెట్ కమిటీ ఛైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, బండపల్లి సాగర్, పసుల అశోక్‌యాదవ్, మద్దెల సురేందర్, బండపల్లి శ్రీను, లింగరాజు, రేసు లింగయ్య, జగన్, రేసు వెంకన్న, తాళ్లపల్లి యాదగిరి, ఉపేందర్ పాల్గొన్నారు.

## హుజూర్‌నగర్‌లో ఆధ్యాత్మిక శోభ



మద్దిరావమ్మ



ముత్యాలమ్మ



అంకమ్మతల్లి

హుజూర్‌నగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): హుజూర్‌నగర్‌లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. సోమవారం రెండో రోజు చిన్న ముత్యాలమ్మ జాతరకు భక్తులు పెద్ద సంఖ్యట తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. మద్దిరావమ్మ, అంకాలమ్మ, చిన్నముత్యాలమ్మ దేవతామూర్తులకు మొక్కులు చెల్లించారు. మహిళా భక్తులు అమ్మవారికి బోనాలు చెల్లించి ప్రత్యేక పూజలు చేశారు. దీవించమ్మా ముత్యాతలమ్మ తల్లీ అంటూ వేడుకున్నారు. ఆదివారం పెద్దముత్యాలమ్మకు, సోమవారం చిన్నముత్యాలమ్మకు పూజలు చేయగా గురువారం కనకదుర్గమ్మ జాతర నిర్వహించనున్నారు.

పట్టణంలో వందలాది మంది రైతులు ట్రాక్టర్లపై ప్రభలు కట్టి పలు ప్రాంతాల నుంచి రైతులు చిన్న ముత్యాలమ్మ ఆలయానికి తరలివచ్చారు. తెల్లవారుజామున ఐదు గంటలకు చిన్నముత్యాలమ్మ దేవాలయంలో అర్చకులు రంగభట్రాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి తొలిబోనం సమర్పించగా రాత్రి 10 గంటల వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. జాతర సందర్భంగా చిన్న ముత్యాలమ్మ దేవాలయ ప్రాంగణంలోని మూడు ఆలయాలకు ప్రత్యేకంగా విద్యుత్ దీపాలు, కాషాయ తోరణాలు అలంకరించారు. హుజూర్‌నగర్ పట్టణంలో ఎటుచూసినా భక్తుల జన సందోహంతో ఆధ్యాత్మిక శోభ ఉట్టి పడింది. వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు, పలు శాఖల అధికారులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వేముల నర్సయ్య, గుండా రమేష్, తండు సైదారత్నం, అరవిందరెడ్డి, దొడ్డా నర్సింహారావు, పశ్య శ్రీనివాసరెడ్డి, రామిశెట్టి రాము, సూర్యప్రకాశ్‌రావు, మాజీ ఎంపీపీ గూడెపు శ్రీనివాసు, మునిసిపల్ మాజీ ఛైర్మన్ గెల్లి అర్చనరవి, యరగాని నాగన్నగౌడ్, అట్లూరి హరిబాబు, చావా సహదేవరావు, కిరణ్మయి, కమిషనర్ శ్రీనివాసరెడ్డి, తన్నీరు మల్లికార్జున్‌రావు, దొంతగాని శ్రీనివాసు, దొంగరి వెంకటేశ్వర్లు, బెల్లంకొండ అమర్‌గౌడ్, ముల్కలపల్లి రాంబాబు, కొండా హరీష్, సోమగాని ప్రదీప్‌గౌడ్, ముసలప్ప పాల్గొన్నారు.



ప్రభ బండ్లతో ముత్యాలమ్మ ఆలయానికి తరలివస్తున్న భక్తులు

## మహాధర్నాను విజయవంతం చేయాలి

తిరుమలగిరి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కాంట్రిబ్యూటరీ పింఛన్ పథకం (సీపీఎస్)ను రద్దు చేయాలని కోరుతూ పీఆర్టీయూ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సెప్టెంబరు ఒకటో తేదీన నిర్వహించే మహా ధర్నాను విజయవంతం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు కసిరెడ్డి అశోక్‌రెడ్డి కోరారు. ఈ మేరకు పీఆర్టీయూ ఆధ్వర్యంలో సోమవారం తిరుమలగిరి జడ్పీహెచ్ఎస్‌లో మహాధర్నా పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో దామెర శ్రీనివాస్, కె.ఉపేంద్ర, వెంకటరామనర్సయ్య, అసిఫ్‌అలి, విజయలక్ష్మి, యాదగిరి, నరేష్, గిరి, రాధిక తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ నవరాత్రి ఉత్సవాలకు అనుమతి తీసుకోవాలి

తిరుమలగిరి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గణేష్ నవరాత్రి ఉత్సవాలకు మండపాల నిర్వాహకులు పోలీసులు అనుమతి తీసుకోవాలని సీఐ నాగేశ్వరరావు కోరారు. సోమవారం తిరుమలగిరిలో ఓ ఫంక్షన్ హాల్ గణేష్ ఉత్సవ కమిటీలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. . మండపాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. డీజేలు నిషేధమని అన్నారు. విద్యుత్ అధికారుల అనుమతి తీసుకోవాలన్నారు. ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరిప్రసాద్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దార్ జాన్‌మహ్మద్, వార్డు ఆఫీసర్ శోభ, మధు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ కాంప్లెక్స్ సమావేశాల సంఖ్యను తగ్గించాలి

పెన్‌పహాడ్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ కాంప్లెక్స్ సమావేశాల సంఖ్యను ప్రభుత్వం తగ్గించాలని తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.వస్రాంనాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరులసమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు రోజులు ఉపాధ్యాయులు కాంప్లెక్ సమావేశాలకు వెళుతున్నందున పాఠశాలలు నామమాత్రంగానే నడుస్తున్నాయన్నారు.

## వాటర్ కూలర్ బహూకరణ అభినందనీయం

తుంగతుర్తి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కోర్టుకు వాటర్ కూలర్‌ను అందజేయడం అభినందనీయమని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎండీ గౌడ్ పాషా అన్నారు. కోర్టుకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపర్తి జ్ఞాన సుందర్ అందించిన వాటర్ కూలర్‌ను సోమవారం ప్రారంభించి మాట్లాడారు. కోర్టుకు వివిధ ప్రాంతాల నుండి వచ్చే న్యాయవాదులు, కక్షిదారుల దాహార్తిని తీర్చడానికి వాటర్ కూలర్ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు.

## వేములూరి కెనాల్‌కి గండి: నీటమునిగిన పంట పొలాలు

మఠంపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న వర్షాలకు యాతవాకిళ్ల వేములూరి ప్రాజెక్టుకు భారీగా వరద నీరు చేరుతోంది. వర్ధాపురం సమీపంలో రెండు చోట్ల గండి పడి పంట పొలాలు నీట మునిగి వేయి ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. మండల వ్యాప్తంగా చాలా చోట్ల ఆర్ అండ్‌బీ, విద్యుత్ శాఖలకు తీవ్ర నష్టం వాటిల్లింది. రెవెన్యూ, విద్యుత్, ఆర్‌అండ్‌బీ, వ్యవసాయ శాఖల వారు యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తి చేసే పనుల్లో ఉన్నారు.

## పెండింగ్ బిల్లుల నిధులు విడుదల చేయాలి

మునగాల రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు సంక్షేమ బోర్డులో పెండింగ్ బిల్లుల నిధులు విడుదల చేయాలని బీసీ డబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలక సోమన్నగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం భవన నిర్మాణ కార్మికసంఘం సీఐటీయు అనుబంధం మండల 5వ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. 55 సంవత్సరాలు దాటిన కార్మికులకు రూ. 9 వేల పెన్షన్ ఇవ్వాలని, పరికరాల కొనుగోలుకు ఆర్థిక సాయం అందజేయారలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బచ్చలకూర స్వరాజ్యం, షేక్ పాషా, ఎస్‌కే సైదా, కోల ఆంజనేయులు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్షుడిగా షేక్ దస్తగిరి, కార్యదర్శిగా నాగరాజు, కోశాధికారిగా నాగేంద్రబాబుతో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

## కృష్ణుడి విగ్రహం ఊరేగింపు

కోదాడ రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కృష్ణాష్టమి సందర్భంగా మండలంలోని కాపుగల్లు గ్రామంలో కృష్ణ మందిరం ఆవరణలో ఏర్పాటు చేసిన కృష్ణుడి ప్రతిమను పల్లకీలో సోమవారం ఊరేగించారు. కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి కోదాడ శాఖ అధ్యక్షుడు పోటు వెంకటేశ్వర్లు, ముత్తవరపు సుబ్బారావు, శైలజ, చందన, చరణ్, వంగాల మహేష్, విజయ, శ్రేయ, సాయి, ఉల్లి రాము, అరుణ, జాస్తి, శివరామకృష్ణ, రమ్య, ఆదిత్య, తత్య సైదా, సత్యంతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ల మండల కమిటీ ఎన్నిక

నాగారం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నాగారం మండల రేషన్ దుకాణాల డీలర్ల మండల కమిటిని డీలర్లు సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కన్నెబోయిన లింగయ్య, ఉపాధ్యక్షులుగా ఎర్ర పుష్పాంజలి, వినిత =లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్లు మర్యాద పూర్వకంగా తహసీల్దార్ హరికిషోర్‌శర్మను కలిశారు.

## పనులను త్వరగా పూర్తిచేయాలి



తొండ గ్రామంలో జాతీయ రహదారిపై పనులను పరిశీలిస్తున్న ఆర్డీవో వేణుమాధవరావు

తిరుమలగిరి రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆర్డీవో వేణుమాధవరావు ఆదేశించారు. ఆదివారం కురిసిన వర్షంతో మండలంలోని తొండ గ్రామంలో కొంత మంది ఇళ్లలోకి నీరు చేరింది. నీరు చేరిన ఇళ్లను, జాతీయ రహదారి పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఇళ్లలోకి నీరు వెళ్లకుండా కాలువల ద్వారా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హరిప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ జానీమహ్మద్, కార్యదర్శి యాకూబ్‌రెడ్డి, ఆర్ఐ జార్జిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్డు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కోదాడ టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రిటైర్డు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించా లని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య కోరారు. ఈ మేరకు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని కోదాడలో సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఉద్యో గులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పాత్రికేయులకు ఉచిత వైద్య పథకం అమలు చేయాలని, చాలాక్రితం రిటైర్డు అయి బెనిఫిట్స్ అందక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, వి.శ్రీనివాసరావు, బి.రాంబాబు, పి.జగన్మోహన్‌రావు, విద్యాసాగర్, రఘువరప్రసాద్, ఖలీల్, అహ్మద్, జి.నరసయ్య, హరిబాబు, పిచ్చిరెడ్డి, ప్రభాకర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భానుపురి, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి)సూర్యాపేట 1వ పట్టణంలో విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ ఆర్. సురేష్ ప్రకటనలో తెలిపారు. నియోగదారులు సహకరించాలని కోరారు.

## సమస్యల వలయంలో అంగన్‌వాడీ కేంద్రాలు

(5వ పేజీ తరువాయి)

వచ్చేందుకు కొందరు వెనుకడుగు వేస్తున్నారు.

**జిల్లాలో 1,209 అంగన్‌వాడీ కేంద్రాలు**

జిల్లాలో 1,209 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఐసీడీఎస్ ప్రాజెక్టులు 5 ఉన్నాయి. జిల్లాలో అద్దె భవనాల్లో 452, సొంత భవనాల్లో 306 కేంద్రాలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా వీటిలో చదువుతున్న చిన్నారులు 45,177 కాగా, గర్భిణులు 5,220, బాలింతలు 4,236 మంది ఉన్నారు. గతంలో కన్నా ఈ ఏడాది 10శాతం వరకు తగ్గినట్టు సమాచారం.

**అంగన్‌వాడీల్లో మెరుగైన సౌకర్యాలు**

అంగన్‌వాడీల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నాం. గర్భిణులకు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని అందిస్తున్నాం. ప్రతి ఒక్కరూ అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

● నర్సింహారావు, జిల్లా సంక్షేమ అధికారి, సూర్యాపేట

## మధ్యాహ్న బకాయిలు రూ.4.71 కోట్లు

(5వ పేజీ తరువాయి)

చెల్లిస్తోంది. జూలై నెలకు సంబంధించిన బకాయి రూ.1.51 కోట్లు ఏజెన్సీకి అందించాల్సి ఉంది. ఇక ఉన్నత పాఠశాలలో సుమారు 10 వేల మంది విద్యార్థులు 9, 10వ తరగతి చదువుతున్నారు. వారిపై రాష్ట్ర ప్రభుత్వం రోజుకు ఒక్కొక్కరిపై రూ.10.67 చొప్పున, రోజుకు రూ.1,06,700 ఖర్చు చేస్తోంది. నెలకు రూ.32 లక్షలు ఖర్చు చెల్లిస్తుంది. అయితే 10 నెలలుగా ఏజెన్సీలకు రూ.3.20 కోట్లు చెల్లించాల్సి ఉందని నిర్వాహకులు చెపుతున్నారు. మొత్తంగా అన్ని ఏజెన్సీలకు కలిపి రూ.4.71 కోట్లు ఏజెన్సీలకు రావాల్సి ఉంది. అప్పులు చేసి బిల్లుల కోసం ఎదురుచూడాల్సి వస్తోందని, వెంటనే బిల్లులు మంజూరు చేయాలని వారు ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నారు.

**రూ.5 లక్షలు రావాలి**

ప్రభుత్వం నుంచి 10 నెలలకు సంబంధించి రూ.5 లక్షలు రావాలి. ప్రతి రోజూ ఇబ్బందులు పడి సరుకులు కొనుగోలు చేసి సర్దుకుపోతున్నాం. తెలిసిన వారి వద్ద వడ్డీకి డబ్బులు తెచ్చాం. ఇటు కూలి గిట్టక, అటు వడ్డీ పెరిగిపోతోంది. అందని బిల్లులతో నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. కనీసం వేతనం కూడా రావటం లేదు. అధికారులను అడిగితే పైనుంచి రానిదే మేమేం చేస్తామంటున్నారు. కిరాణ దుకాణంలో ఇప్పటికే బాకీ రూ లక్షలలో ఉంది. అవి చెల్లిస్తే తప్ప కొత్తగా సరుకులు ఇవ్వమంటున్నారు. హెచ్ఎం, టీచర్లు మధ్యవర్తిగా పెట్టి వస్తువులు తెస్తున్నాం. బిల్లులు రాక ఎన్నాళ్ల తిప్పలు పడాలో అర్థం కావడంలేదు. బిల్లుల కోసం నిరసనలు చేస్తున్నాం. ఇప్పటికైనా బిల్లులు చెల్లించి సమస్యను పరిష్కరించాలి.

● శివరాత్రి సుజాత, మధ్యాహ్న భోజన నిర్వహకురాలు